RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 192 | ఆగస్టు 12 బుధవారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 192 | August 12 Wednesday2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


**చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ: ఆగస్టు 31 వరకు అవకాశం**

2

## పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి



### సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

**హైదరాబాద్ జనసంఘర్షణ :**
హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనులతో పాటు మెట్రో ఫేజ్-2 కారిడార్ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మెట్రో రైల్ ప్రాజెక్టుల పురోగతి మరియు రాబోయే 'ఇన్వెస్ట్ తెలంగాణ' గ్లోబల్ సమ్మిట్‌పై ఆయన అధికారులకు కీలక మార్గదర్శకాలు చేశారు. పాతబస్తీ లైన్‌కు సంబంధించి ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఉన్న 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, వీలైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను ప్రారంభించాలని సూచించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనపు మెట్రో కోచ్‌లను కొనుగోలు చేయడంతో పాటు, సాంకేతిక పరిజ్ఞానంలో మెరుగైన ఫలితాల కోసం ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఇదే క్రమంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేందుకు వచ్చే డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించబోతున్నామని వెల్లడించారు. గతంలో వచ్చిన పెట్టుబడుల పురోగతిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తూ, సమ్మిట్ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులను సన్మానించేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండవు

**పార్లమెంట్‌లో స్పష్టం చేసిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
రూపే, గూగుల్ పే, ఫోన్ పే వంటి యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ డిజిటల్ లావాదేవీలపై వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోమని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తేల్చి చెప్పారు. యూపీఐ చెల్లింపులపై రుసుములు విధిస్తారంటూ వస్తున్న ప్రచారాన్ని, అనుమానాలను ఆమె తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీలు వాస్తవాలు తెలుసుకోకుండా అసత్య ప్రచారాలు చేస్తున్నాయని పార్లమెంట్‌లో విమర్శించారు. ఎండీఆర్ చట్టసవరణపై ఉచిత యూపీఐ సేవాలు కొనసాగుతాయని స్పష్టం చేసిన మంత్రి, భవిష్యత్తులో కేవలం కొన్ని నిర్దిష్ట రకాల లావాదేవీలకు మాత్రమే 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (వీణ=) వసూలు చేసే వెసులుబాటు కల్పించామని వెల్లడించారు. ఈ చట్టసవరణను ఇప్పటికిప్పుడు వినియోగదారుల నుంచి రుసుములు వసూలు చేయడానికి తీసుకురాలేదని తెలిపారు.

➤ మిగతా 2వ పేజిలో..

## సంగారెడ్డి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదాలు

### తొమ్మిది మంది దుర్మరణం, పలువురికి తీవ్ర గాయాలు

**సంగారెడ్డి జనసంఘర్షణ**
సంగారెడ్డి జిల్లాలో మంగళవారం చోటుచేసుకున్న రెండు వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాల్లో మొత్తం 9 మంది ప్రాణాలు కోల్పోయారు. జహీరాబాద్, కోహీర్ మండలాల్లో జరిగిన ఈ విషాద సంఘటనలు స్థానికంగా తీవ్ర తీవ్ర దిగ్భ్రాంతిని నింపాయి.

**ఆటోను ఢీకొట్టిన ఆయిల్ ట్యాంకర్ - ఏడుగురు కూలీల మృతి**

జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద 65వ నంబరు జాతీయ రహదారిపై ఆటోను వేగంగా వచ్చిన ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం పాలవగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో ఆటోలో మొత్తం 14 మంది ప్రయాణిస్తున్నట్లు తెలిసింది. బాధితులంతా కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లాలోని రాజగిరి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. రోజువారీ కూలి పని నిమిత్తం హుమనాబాద్ నుంచి జహీరాబాద్ వస్తుండగా, హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటక వైపు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ వీరి ఆటోను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను వెంటనే జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

**డివైడర్ పైనుంచి ఎగిరిపడిన కారు - ఇద్దరు మృతి**

అటు కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపైనే మరో ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా వెళ్తున్న ఒక కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్ పైనుంచి అవతలి వైపునకు ఎగిరిపడింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, రహదారిపై వెళ్తున్న మరో నాలుగు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

➤ మిగతా 2వ పేజిలో..

## నేడు పలు దేశాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం

**భారత్‌కు లేదు .. 2034లోనే తదుపరి అవకాశం**



**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
ఆగస్టు 12 (బుధవారం) ఆషాఢ అమావాస్య పర్వదినాన ప్రపంచ వ్యాప్తంగా అరుదైన ఖగోళ వింత చోటుచేసుకోనుంది. ఈ రోజున అత్యంత అరుదైన సంపూర్ణ సూర్యగ్రహణం ఏర్పడబోతోందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు. అయితే, ఈ గ్రహణ ప్రభావం భారత్‌పై ఉండదని, ఇక్కడ ఇది కనిపించదని నిపుణులు స్పష్టం చేశారు.

**ఎక్కడెక్కడ కనిపిస్తుంది?**

ఈ సంపూర్ణ సూర్యగ్రహణం ప్రపంచవ్యాప్తంగా దాదాపు 55 దేశాల్లో పూర్తిస్థాయిలో దర్శనమివ్వనుంది. అలాగే మరో 33 దేశాల్లో పాక్షికంగా కనిపించనుంది. ప్రధానంగా ఐరోపా ఖండంలోని పలు ప్రాంతాలు, వాయువ్య ఆఫ్రికా, ఉత్తర అమెరికాలోని కొన్ని భాగాల్లో ఈ దృశ్యం ఆవిష్కృతమవుతుంది. ప్రత్యేకించి స్పెయిన్‌తో పాటు ఐరోపాలోని స్టేషన్ నోర్డ్, సప్ఫూర్, బోర్గార్నాస్, రెక్జావిక్, కెప్లావ్క్, సాన్టాండర్, బిల్బావో, గిజోన్, ఒవిడో, విటోరియా గస్టీజ్, ఎ కొరువా, లుగో, లోగ్రూ, బుర్గోస్, పోన్‌ఫెరాడా, జరాగో వంటి

➤ మిగతా 2వ పేజిలో..

## కేరళ ఇక నుంచి 'కేరళం'

**లోక్‌సభలో పేరు మార్పు బిల్లుకు ఆమోదం**




**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
కేరళ రాష్ట్రం పేరును రాజ్యాంగబద్ధంగా 'కేరళం'గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'కేరళ (పేరు మార్పు) బిల్లు- 2026' కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మంగళవారం విపక్షాల నిరసనలు, హంగామా మధ్యే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టగా, లోక్‌సభ దీనికి మూజువాణి ఓటు ద్వారా ఆమోదముద్ర వేసింది. 'కేరళం'గా ఎందుకు? క్రీ.శ. 1956 నవంబర్ 1న భాషా ప్రయుక్త రాష్ట్రంగా 'కేరళ' ఆవిర్భవించింది. స్థానిక మలయాళ భాషలో ఈ రాష్ట్రాన్ని దశాబ్దాలుగా 'కేరళం' అని పిలుస్తున్నారు. అయినప్పటికీ భారత రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో మాత్రం రాష్ట్ర పేరు 'కేరళ'గానే నమోదై ఉంది. రాజ్యాంగంలో కూడా రాష్ట్ర పేరును

➤ మిగతా 2వ పేజిలో..

## భారీ భూకంపంతో వణికిన కొలంబియా

### 132కు చేరిన మృతుల సంఖ్య, శిథిలాల కింద వందలాది మంది

**న్యూఢిల్లీ జనసంఘర్షణ**
దక్షిణామెరికా దేశమైన కొలంబియాలో సంభవించిన విధ్వంసకర భూకంపం పెను విషాదాన్ని నింపింది. పశ్చిమ కొలంబియా ప్రాంతంలో రిక్టర్ స్కేలుపై 7.4 తీవ్రతతో చోటుచేసుకున్న ఈ భారీ భూకంప ధాటికి ప్రాణనష్టం భారీగా పెరుగుతోంది. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం మరణించిన వారి సంఖ్య 132కు చేరగా, మరో 570 మంది తీవ్రంగా గాయపడ్డారు. భవనాలు నేలమట్టం కావడంతో శిథిలాల కింద పెద్ద సంఖ్యలో ప్రజలు చిక్కుకుపోయారు.



➤ మిగతా 2వ పేజిలో..

## పార్లమెంట్‌లో తొలగని ప్రతిష్టంభన

**న్యూఢిల్లీ జనసంఘర్షణ :**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తుది దశలోనూ అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి ప్రతిష్టంభన కొనసాగుతోంది. మంగళవారం లోక్‌సభ ప్రారంభం కాగానే విపక్ష ఎంపీలు సభ మధ్యలోకి (పోడియం) దూసుకొచ్చి ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. సభను సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని, అర్థవంత మైన చర్చలు జరపాలని స్పీకర్ ఓం బిర్లా పదేపదే విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయింది.



ఆందోళనలు సద్దుమణగకపోవడంతో స్పీకర్ మొదట సభను మధ్యాహ్నం

➤ మిగతా 2వ పేజిలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
12 బుధవారం, ఆగస్టు 2026

## యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండవు

**మొదటి పేజీ తరువాయి..** భవిష్యత్తులో ఏ వస్తువులపై ఎండీఆర్ వర్తింపజేయాలి, ఎంత ధర వరకు పరిమితి విధించాలనే అంశాన్ని ఇంకా ఖరారు చేయలేదని, దీనిపై తరువాత నోటిఫికేషన్ విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఈ విధానం వల్ల చిరు వ్యాపారులపై ఎలాంటి అదనపు భారం పడదని హామీ ఇచ్చారు. 2016లో ప్రారంభమైన యూపీఐ ఉచిత సేవలు అలాగే కొనసాగుతాయన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే భారత ప్రభుత్వం యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేసేందుకు సిద్ధమైందని సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. దీనిపై ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘాటుగా స్పందిస్తూ.. "వాస్తవాలను వక్రీకరించి ప్రచారం చేయడమే కమ్యూనిస్టుల నైజం" అని ఎద్దేవా చేశారు. సమాధానం వినే ధైర్యం లేక ప్రతిపక్షాలు సభలో ఆందోళనలు చేస్తున్నాయని విమర్శించారు.

## నేడు పలు దేశాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం

**మొదటి పేజీ తరువాయి..** నగరాల్లో గ్రహణం స్పష్టంగా కనిపిస్తుంది. ఐరోపాలో సూర్యాస్తమయ సమయానికి సమీపంలో గ్రహణం సంభవించనుండటంతో, అక్కడ సాయంత్రం వేళ ఆకాశంలో ఇది ఒక అసాధారణమైన అద్భుతంగా నిలవనుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.
గ్రహణాన్ని వీక్షించే ప్రజలు తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సూర్యగ్రహణాన్ని నేరుగా కంటితో చూడటం వల్ల దృష్టి లోపాలు లేదా కంటి నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

**భారత్‌లో ఎప్పుడు?**

ఈ గ్రహణం భారత్‌లో కనిపించనందున ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. భారతదేశంలో తదుపరి సంపూర్ణ సూర్యగ్రహణం 2034 మార్చి 20న ఏర్పడనుంది. ఆ గ్రహణం భారత్‌తో పాటు ఆసియా ఖండం, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్ మరియు ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో సుదీర్ఘంగా కనిపిస్తుంది.

## కేరళ ఇక నుంచి 'కేరళం'

**మొదటి పేజీ తరువాయి..** మలయాళ ఉచ్చారణకు అనుగుణంగా 'కేరళం'గా సవరించాలని కోరుతూ 2024 జూన్‌లో కేరళ శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. రాజ్యాంగ సవరణ దిశగా నెక్స్ట్ స్టెప్: రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం, కేంద్ర క్యాబినెట్ ఆమోదం అనంతరం రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం కేంద్రం ఈ సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లును తదుపరి ప్రక్రియ కోసం రాజ్యసభకు పంపనున్నారు. రాజ్యసభ కూడా ఆమోదించి, రాష్ట్రపతి సంతకం పూర్తి కాగానే అధికారికంగా అన్ని రికార్డుల్లోనూ కేరళ పేరు 'కేరళం'గా మారిపోతుంది. విపక్షాల ఆందోళనల నడుమ ఆమోదం: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. సభలో తీవ్ర గందరగోళం నెలకొన్నప్పటికీ స్పీకర్ స్థానంలో ఉన్న కృష్ణప్రసాద్ తెన్నేటి బిల్లుపై ప్రక్రియను పూర్తి చేసి మూజువాణి ఓటుతో బిల్లును ఆమోదించారు.

## జార్ఖండ్ పేపర్ లీకులకు జవాబివ్వండి

**ఏం చర్యలు తీసుకున్నారో చెప్పండి**

**పార్లమెంట్‌లో చర్చకు భయపడుతున్న రాహుల్**

**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్**

**విశాఖపట్నం :** జార్ఖండ్‌లో పర్వీస్ కమిషన్ పరీక్షలో అవకతవకలు జరిగినట్లు తేలిందని.. ఈ క్రమంలోనే విద్యార్థులు ఆందోళన చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. వారిపైనా రబ్బర్ బుల్లెట్స్, లాఠీఛార్జి చేశారన్నారు. జెఎంఎం, కాంగ్రెస్ ప్రభుత్వమే అక్కడ నడుస్తోందని చెప్పారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయినట్లు తెలిసిన వెంటనే పరీక్ష రద్దు చేశామని, పిల్లల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. కేంద్ర మంత్రి కూడా రాజీనామా చేశారని వెల్లడించారు. బీజేపీ ప్రభుత్వానికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న తేడా ఇదే అని చెప్పుకొచ్చారు.
జార్ఖండ్‌లో ఎస్ఎస్‌సీ పేపర్ లీక్ వల్ల ఎంతో మంది యువత జీవితం రోడ్డుపాలవుతోందని మాధవ్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. కేంద్రంలో తప్పు జరిగిందని.. వెంటనే దాన్ని కరెక్ట్ చేశామని అన్నారు. రాహుల్ గాంధీ పిరికివారని.. అందుకే పార్లమెంట్‌కు రాకుండా పారిపోతున్నారని విమర్శించారు. పేపర్ లీక్‌పై చర్చించడానికి సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. వైఎస్సార్ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలపై జగన్, షర్మిల ముందుకు రావాలన్నారు.
వైసీపీ దిక్కుతోచని స్థితిలో ఉందంటూ వ్యాఖ్యానించారు. డీఎస్సీ పూర్తి పారదర్శకంగా జరిగిందని.. ఏం చేయాలో తెలియక వైసీపీ కావాలని రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. క్రీడా కోటాలో ఉద్యోగాలపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చిందని బీజేపీ ఏపీ అధ్యక్షుడు అన్నారు. వైసీపీ చేస్తున్న నిరసనలను ప్రజలు ఛీత్కరించుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రాజశేఖర్ రెడ్డి హయాంలో చేసినట్లు, తమ జీవితాలను నాశనం చేయొద్దని ఉద్యోగులు కూడా ఆందోళన చేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నామని.. విశాఖలో అత్యధిక స్థానాల్లో కూటమి ప్రభుత్వం గెలుస్తుందని పీవీఎన్ మాధవ్ ధీమా వ్యక్తం చేశారు.

## భారీ భూకంపంతో వణికిన కొలంబియా

**ప్రకంపనలతో కుప్పకూలిన భవనాలు:**

అమెరికా జియోలాజికల్ సర్వే వివరాల ప్రకారం.. చోకో ప్రాంతంలోని 'శాన్ జోసె డెల్ పాల్మార్' సమీపంలో భూమికి 107 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. ఈ భూకంప తీవ్రతకు రాజధాని బొగోటాతో పాటు కాలీ, పెరీరా, మానిజాలెస్ వంటి ప్రధాన నగరాలు, పొరుగు దేశాలు కూడా తీవ్రంగా ప్రకంపించాయి. పెరీరా, కాలీ నగరాల్లో అనేక బహుళ అంతస్తుల భవనాలు, ఇళ్లు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు కుప్పకూలాయి. మానిజాలెస్‌లోని ఒక చారిత్రక కేథడ్రల్ టవర్ కూడా నేలమట్టమైంది. కాలీలోని ఒక ప్రధాన ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతినడంతో, సుమారు 30 శాతం నిర్మాణం ధ్వంసమైంది. అక్కడ ఉన్న రోగులను అత్యవసరంగా సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

జాతీయ విపత్తుగా ప్రకటన – రంగంలోకి సైన్యం:

భూకంప తీవ్రత మరియు సంభవించిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకుని కొలంబియా ప్రభుత్వం దేశంలో జాతీయ విపత్తును ప్రకటించింది. బాధితులను రక్షించేందుకు ప్రభుత్వం సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని ప్రాణాలతో బయటకు తీయడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా స్పష్టం చేశారు. సైన్యం ప్రత్యేక రెస్క్యూ బృందాలు, డాగ్ స్క్వాడ్స్, అధునాతన పరికరాలతో సహాయక చర్యలను తీవ్రతరం చేసింది.

రవాణా వ్యవస్థ స్తంభన – నిలిచిపోయిన విమానాలు:

కొలంబియాలోని అనేక రిమోట్ ప్రాంతాల్లో రహదారులు ధ్వంసం కావడంతో పాటు కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో సహాయక బృందాలు అక్కడకు చేరుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. అలాగే ముందుజాగ్రత్త చర్యగా పెరీరా, మానిజాలెస్, ఆర్మేనియా, కార్టాగో, బ్యూనవెంచురా తదితర విమానాశ్రయాల్లో కార్యకలాపాలను నిలిపివేశారు. కేవలం వైద్య సేవలు, ప్రభుత్వ అత్యవసర విమానాలకు మాత్రమే రాకపోకల అనుమతినిస్తున్నారు.

ముందుకొచ్చిన అంతర్జాతీయ సమాజం:

విపత్తులో చిక్కుకున్న కొలంబియాను ఆదుకునేందుకు పలు దేశాలు సహాయ హస్తం అందించాయి. పొరుగు దేశమైన ఈక్వెడార్ 47 మంది నిపుణులైన రెస్క్యూ సిబ్బందిని, శిక్షణ పొందిన శునకాలను రంగంలోకి దించేందుకు సిద్ధమైంది. ఎల్ సాల్వడార్, మెక్సికో మరియు అమెరికా కూడా అవసరమైన సహాయక సామగ్రిని, బృందాలను పంపేందుకు సమ్మతి తెలిపాయి.

## చేయూత కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణ: ఆగస్టు 31 వరకు అవకాశం

**హైదరాబాద్ :**
అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం 'చేయూత' సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు ప్రక్రియను ప్రారంభించింది. తొలిదశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, అలాగే తలసేమియా, సికిల్ సెల్, హీమోఫీలియా వంటి తీవ్ర రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ కొత్త పింఛన్లు అందజేయనున్నారు. కొత్త దరఖాస్తుల స్వీకరణకు ఆగస్టు 31 వరకు తుది గడువుగా నిర్ణయించారు. ఈ కొత్త పింఛన్ల మంజూరుకు సంబంధించి అర్హత ప్రమాణాల్లో ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. గత ప్రభుత్వాల హయాంలో (2014 నుంచి 2018 మధ్య) జారీ చేసిన జీవోల్లోని నిబంధనలనే ప్రామాణికంగా తీసుకుని అర్హులను ఎంపిక చేయనున్నారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు మరియు ప్రజావాణి ద్వారా ఇప్పటికే దరఖాస్తులు చేసుకుని, అవసరమైన పత్రాలు సమర్పించిన వారు మళ్లీ అప్లై చేయాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. అయితే ఇదివరకు సరిగ్గా పత్రాలు సమర్పించని వారు లేదా కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకునే అర్హులు ఆగస్టు 31 లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.
అర్హత నిర్ధారణ కోసం వితంతువులకు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళలకు స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ సర్టిఫికేట్, చేనేత కార్మికులకు జౌళి శాఖ, బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి. దరఖాస్తుదారులకు సహకరించే బాధ్యతను స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు అప్పగించారు. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జిల్లా కలెక్టర్ ఆమోదంతో మంజూరు చేస్తారు. దరఖాస్తుల వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టి, పూర్తి పారదర్శకతతో అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు వేగవంతం చేశారు.

## పార్లమెంట్‌లో తొలగని ప్రతిష్టంభన

2 గంటల వరకు, ఆ తర్వాత బుధవారానికి వాయిదా వేశారు.

**పార్లమెంట్ ఆవరణలో హోరాహోరీ నినాదాలు:**

మరోవైపు పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద అధికార ఎన్డీయే, విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు పోటాపోటీగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని విపక్ష ఎంపీలు బిగ్గరగా నినాదాలు చేశారు. దీనికి పోటీగా జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై జరిగిన పోలీసు చర్యలను నిరసిస్తూ ఎన్డీయే ఎంపీలు ఆందోళన చేపట్టారు. జార్ఖండ్ విద్యార్థుల అంశంపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించగా, అయోధ్య రామమందిరం విరాళాల వ్యవహారంపై కూడా విపక్షాలు కేకలు వేశాయి.

**మెలిక పెట్టిన రాహుల్ గాంధీ -- కిరణ్ రిజిజూ స్పందన:**

విద్యార్థుల ఆందోళనలపై జరిగే చర్చకు హోంమంత్రి అమిత్ షా స్వయంగా సమాధానం చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజూ స్పష్టం చేశారు. అయితే విపక్షాలు శాంతియుతంగా సమాధానం వినాలని షరతు విధించారు. కాగా, కేవలం ఉపన్యాసాలు ఇవ్వడం కాదు, తాము అడిగిన నిర్దిష్ట ప్రశ్నలకు మాత్రమే హోంమంత్రి సూటిగా సమాధానం చెప్పాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొత్త మెలిక పెట్టడంతో సభలో రాజకీయ పంతం మరింత ముదిరింది. ఉభయ పక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## నిషేధిత భూములపై ప్రజలు ఆందోళన చెందొద్దు: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ :**
నిషేధిత ఆస్తుల (పీఓబీ / 22ఎ) జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సచివాలయంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, సబ్‌రిజిస్ట్రార్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.
భూముల రెగ్యులరైజేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతుల వివరాలన్నింటినీ ఈనెల 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల ఫోర్జరీ, బోగస్ డాక్యుమెంట్లకు అడ్డుకట్ట పడుతుందని, సబ్‌రిజిస్ట్రార్లకు రిజిస్ట్రేషన్ సమయంలో స్పష్టత వస్తుందన్నారు. పారదర్శకతను పెంచేందుకు పహాణీలను కూడా సబ్‌రిజిస్ట్రార్లకు అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. వచ్చిన దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, పీఓబీకి సంబంధించిన దరఖాస్తులను ఇకపై తహశీల్దార్లకు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపాలని స్పష్టం చేశారు. బాధ్యతలన్నీ కలెక్టర్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ల మధ్యనే కొనసాగాలని తెలిపారు.
సబ్‌రిజిస్ట్రార్లకు అదనపు విచక్షణాధికారాలు ఉండకూడదని, కేవలం ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల ఆధారంగా మాత్రమే నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పీఓబీ జాబితాలోని ఆస్తుల రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించకుండా, మూడు రోజుల సమయం తీసుకుని తిరస్కరణకు గల స్పష్టమైన కారణాలను తెలియజేయాలన్నారు. ఉద్దేశపూర్వకంగా పేదలకు అన్యాయం చేసినా, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో అలసత్వం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఈ నిర్ణయాలను వెంటనే అమల్లోకి తెచ్చేలా సబ్‌రిజిస్ట్రార్లతో సమావేశం ఏర్పాటు చేయాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీని మంత్రి ఆదేశించారు.

# నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో 6 కిలోల గంజాయి పట్టివేత

- కామారెడ్డి ఎక్సైజ్, జిల్లా టాస్క్‌ఫోర్స్, రైల్వే పోలీసుల సంయుక్త తనిఖీలు

కామారెడ్డి,/ ఆగస్టు 11:/(జన సంఘర్షణ)

నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో అక్రమంగా తరలిస్తున్న 6 కిలోల ఎండు గంజాయిని కామారెడ్డి ఎక్సైజ్ అధికారులు, జిల్లా టాస్క్‌ఫోర్స్, రైల్వే పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. స్తంభంపూర్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో అధికారులు తనిఖీలు చేపట్టగా గంజాయి పట్టుబడినట్లు కామారెడ్డి ఎక్సైజ్ సీఐ సంపత్ కృష్ణ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు వెల్లడించారు.

**నిందితుల కోసం గాలింపు....**

గంజాయి అక్రమ రవాణాతో సంబంధం ఉన్న నిందితులు ప్రస్తుతం పట్టుబడలేదని అధికారులు తెలిపారు. వారి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. రైలులో గంజాయి తరలింపు ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

**యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి**

గంజాయి తదితర మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పదంగా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల రవాణా జరుగుతున్నట్లు సమాచారం



తెలిసిన వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు."మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి.. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి" అని అధికారులు పిలుపునిచ్చారు.

# సుంకినిలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

- గ్రామస్థాయి నుంచి సంఘటిత నిర్మాణానికి శ్రీకారం..
- సామాజిక ఉద్యమాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం...

సుంకిని,/ ఆగస్టు 10/జన సంఘర్షణ):

పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ మాసాయిపేట యాదగిరి మాదిగ, బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జ్ సోంపూర్ పోచిరాం మాదిగ ఆధ్వర్యంలో పోతంగల్ మండలం సుంకిని గ్రామంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచే సంఘటితంగా పనిచేస్తూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితిని మరింత బలోపేతం చేయాలని మందకృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపును వివరించారు. సామాజిక న్యాయం సాధించే ఉద్యమంలో యువతను భాగస్వాములను చేస్తూ నూతన తరానికి నాయకత్వ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సుంకిని గ్రామ నూతన కమిటీగా గ్రామ అధ్యక్షుడిగా గాయక్వాడ్..సతీష్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా గాయక్వాడ్ గోవింద్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా చిల్మేవార్ చంద్రకాంత్ మాదిగ, అధికార ప్రతినిధిగా చిల్మేవార్ సంగ్రామ్ మాదిగ, కార్యదర్శిగా గాయక్వాడ్ లాలయ్య మాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా పోతంగల్ మండల నూతన కమిటీ ఇంచార్జ్‌లుగా నేరోళ్ల అశోక్ మాదిగ, నకేవర్ హరిదాస్ మాదిగ, కర్రే సాయినాథ్ మాదిగ, గొంటి నవీన్ మాదిగలను నియమించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మాదిగ రిజర్వేషన పోరాట సమితి నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ



చైర్మన్ గైక్వాడ్ హన్మంత్ మాదిగ, గ్రామ కుల సంఘాల ప్రతినిధులు, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి సమితిని మరింత బలోపేతం చేసి, సామాజిక న్యాయం కోసం ఐక్యంగా పనిచేస్తామని తెలిపారు. మాదిగల హక్కుల సాధన కోసం ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# రామాయంపేటలో మువ్వన్నెల సందడి

- దేశభక్తిని చాటిన త్రివర్ణ ర్యాలీ.
- 800 మంది విద్యార్థులతో 200 మీటర్ల జాతీయ జెండా ప్రదర్శన.
- పట్టణ ప్రధాన వీధుల్లో మారుమోగిన దేశభక్తి నినాదాలు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జన సంఘర్షణ)

రామాయంపేటలో స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా రామాయంపేట పట్టణం మువ్వన్నెల వెలుగులతో శోభిల్లింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన ప్రతి ఇంటిపై జాతీయ జెండా" సంకల్పాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రామాయంపేట పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా త్రివర్ణ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రామాయంపేట పట్టణ అధ్యక్షుడు శీలం అవినాష్ రెడ్డి నేతృత్వంలో నిర్వహించిన ఈ ర్యాలీ అత్యంత కోలాహలంగా సాగింది.సుమారు 800 మంది పాఠశాల విద్యార్థులు 200 మీటర్ల పొడవైన జాతీయ జెండాను చేతబట్టి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీగా కదిలారు. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో పట్టణ వీధులన్నీ మారుమోగాయి. ర్యాలీని చూసేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో రోడ్ల వెంట నిలబడి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను నేటి యువత గుర్తుంచుకోవాలని అన్నారు. జాతీయ జెండా ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తిని, జాతీయ స్ఫూర్తిని నింపే పవిత్ర ప్రతీక అని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ ఐక్యతను, సమగ్రతను చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మాట్లాడుతూ.. జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి భారతీయుడు "నా దేశం.. నా ధర్మం" అనే భావనతో దేశాన్ని ప్రేమించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న సంకల్పంలో భాగంగానే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాగి రాములు తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను ప్రతి కుటుంబంలో మరింత బలపరచాలన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు.ముఖ్యంగా విద్యార్థులు, యువతలో దేశభక్తి భావనను పెంపొందించి,దేశం పట్ల బాధ్యత, జాతీయత, క్రమశిక్షణ వంటి విలువలను పెంచడమే ఈ త్రివర్ణ ర్యాలీ ఉద్దేశమని రాగి రాములు పేర్కొన్నారు. "మన గౌరవంగా మనం జీవించాలంటే ముందుగా మన దేశాన్ని గౌరవించాలి. జాతీయ జెండా మన ఆత్మగౌరవానికి ప్రతిరూపం. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలన్నదే ప్రధాని మోదీ సంకల్పం" అని రాగి రాములు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రంజిత్ మోహన్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్ కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మస్కూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.అలాగే పార్టీ నాయకులు ప్రవీణ్ రాజు, అక్కల అనిల్, దిలీప్, నాగరాజు, వెంకటేష్, శంకర్ గౌడ్, కాశీనాథ్, సిద్ధారములు, శేఖర్, రమేష్, మల్లిక, విజయ్, సత్యనారాయణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు భారీ జాతీయ జెండాను చేతబట్టి క్రమశిక్షణతో నిర్వహించిన ఈ ర్యాలీ రామాయంపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యతను చాటుతూ సాగిన ఈ త్రివర్ణ ర్యాలీ పట్టణ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని మువ్వన్నెల సందడి. ఎన్ ఎంతోమంది మహనీయులు చేసిన త్యాగాలను నేటి యువత గుర్తుంచుకోవాలని అన్నారు. జాతీయ జెండా ప్రతి భారతీయుడి గుండెల్లో దేశభక్తిని, జాతీయ స్ఫూర్తిని నింపే పవిత్ర ప్రతీక అని పేర్కొన్నారు. 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశ ఐక్యతను, సమగ్రతను చాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు మాట్లాడుతూ.. జాతీయ జెండా కేవలం ఒక వస్త్రం కాదని, అది ప్రతి భారతీయుడి ఆత్మగౌరవానికి, దేశభక్తికి, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక అని అన్నారు. ప్రతి భారతీయుడు "నా దేశం.. నా ధర్మం" అనే భావనతో దేశాన్ని ప్రేమించాలని పిలుపునిచ్చారు. దేశం కోసం, ధర్మం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న సంకల్పంలో భాగంగానే 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రాగి రాములు తెలిపారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయడం ద్వారా దేశభక్తి భావనను ప్రతి కుటుంబంలో మరింత బలపరచాలన్నదే ఈ



కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో దేశభక్తి భావనను పెంపొందించి, దేశం పట్ల బాధ్యత, జాతీయత, క్రమశిక్షణ వంటి విలువలను పెంచడమే ఈ త్రివర్ణ ర్యాలీ ఉద్దేశమని రాగి రాములు పేర్కొన్నారు. "మన గౌరవంగా మనం జీవించాలంటే ముందుగా మన దేశాన్ని గౌరవించాలి. జాతీయ జెండా మన ఆత్మగౌరవానికి ప్రతిరూపం. దేశం కోసం, ధర్మం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలి. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలన్నదే ప్రధాని మోదీ సంకల్పం" అని రాగి రాములు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రంజిత్ మోహన్, మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి పంజా విజయ్ కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మస్కూరి బాలరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు ప్రవీణ్ రాజు, అక్కల అనిల్, దిలీప్, నాగరాజు, వెంకటేష్, శంకర్ గౌడ్, కాశీనాథ్, సిద్ధారములు, శేఖర్, రమేష్, మల్లిక, విజయ్, సత్యనారాయణ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు భారీ జాతీయ జెండాను చేతబట్టి క్రమశిక్షణతో నిర్వహించిన ఈ ర్యాలీ రామాయంపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఐక్యతను చాటుతూ సాగిన ఈ త్రివర్ణ ర్యాలీ పట్టణ ప్రజల్లో దేశభక్తి స్ఫూర్తిని నింపింది.

# కారోబార్ కృష్ణ కుటుంబానికి అండగా ఉంటా

- రూ.2లక్షల ఆర్థిక సహాయం అందజేసిన
- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జన సంఘర్షణ)




రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాపన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ కారొభార్ ఆకుల కృష్ణ కుటుంబానికి తాను అపద సమయంలో అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు తెలిపారు. మంగళవారం అయన కృష్ణ స్వగ్రామానికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని,కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కృష్ణ మృతి తనను తీవ్రంగా కలిచివేసిందని,చిన్న వయసులోనే కుటుంబానికి దూరం కావడం బాధాకరమన్నారు.కృష్ణ కుటుంబం ఒంటరిది కాదని, కష్టకాలంలో వారికి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కుటుంబానికి ఈ సందర్భంగా రూ.2లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అవుట్ సోర్సింగ్ కింద ఉద్యోగంకల్పిస్తానని, ఎలాంటి అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే,సహాయం చేసేందుకు ముందుంటానని భరోసా కల్పించారు. కుటుంబ సభ్యులు మాజీ ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, భాస్కర్ లకు ధైర్యం కోల్పోకుండా మనోధైర్యంతో ఉండాలని సూచించారు. కృష్ణ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ,ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం కుర్తివాడ మాజీ సర్పంచ్ రామాగౌడ్ ప్రమాదవ శాత్తూ ద్విచక్ర వాహనంపై నుండి కిందపడి వెన్నుముకపై బలమైన గాయాలు కావడంతో నడవలేని పరిస్థితి నెలకొందని తెలుసుకున్న అయన రామగౌడ్ సహోదరి ఇంటివద్ద ఉంటున్నారని తెలుసుకుని పరామర్శించారు.ఆరోగ్య స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. అయన వెంట పాపన్నపేట సర్పంచ్ పావని నరేందర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పి.ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ప్రశాంత్ రెడ్డి,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు వెంకటేశం, సర్పంచులు శ్రీధర్, శ్రీనివాస్, శేఖర్, శ్రీశైలం అప్ప, యాదగిరి, నాయకులు శ్రీకాంత్ అప్ప, నిట్టలాక్షప్ప,బాపురెడ్డి, దోసని సంగమేశ్వర, ముశెట్టి కిష్టయ్య, కుర్తివాడ ప్రసాద్ గౌడ్, సత్యనారాయణ, ఎండీ. ఖలీం, ఎండీ.అబెద్, సంతోష్ రెడ్డి, కార్యకర్తలు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# నస్రుల్లాబాద్‌లో కాంగ్రెస్ కార్యాలయానికి శ్రీకారం..

- పరిశీలనకు ఏనుగు రవీందర్ రెడ్డి
- "రేపు ఉదయం 9 గంటలకు నస్రుల్లాబాద్‌కు రాక..
- భారీగా తరలిరావాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపు

నస్రుల్లాబాద్/, ఆగస్టు 11: / జన సంఘర్షణ)



బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత పటిష్టం చేసే దిశగా మరో కీలక అడుగు పడనుంది. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి మంగళవారం (ఆగస్టు 11) నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో పర్యటించనున్నారు. నస్రుల్లాబాద్‌లోని తన సొంత స్థలంలో నిర్మించబోయే కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి సంబంధించిన ఏర్పాట్లు, నిర్మాణ పనులపై పరిశీలన చేపట్టేందుకు ఆయన ఉదయం 9 గంటలకు అక్కడికి చేరుకోనున్నారు. కార్యాలయం నిర్మాణంతో పాటు పార్టీ కార్యకలాపాలను మరింత సమన్వయంతో నిర్వహించే అంశాలపై కూడా పార్టీ నాయకులతో చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యాలయ నిర్మాణం పూర్తయితే నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వేదికగా మారనుందని కాంగ్రెస్ శ్రేణులు భావిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై చర్చలు, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలకు ఈ కార్యాలయం కేంద్రంగా నిలిచే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, అభిమానులు, పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్, కునీపూర్ సర్పంచ్ బోయిడి లక్ష్మణ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. "పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలి.. ఐక్యంగా ముందుకు సాగుదాం"....: అనే సందేశంతో పార్టీ శ్రేణులు కార్యక్రమానికి సిద్ధమవుతున్నాయి. అందుబాటులో ఉన్న ప్రతి కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుడు రేపటి కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని బోయిడి లక్ష్మణ్ ముదిరాజ్ కోరారు.

# ఆయిల్‌పామ్ తోటల్లో వీవిల్ విడుదల

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జన సంఘర్షణ)

మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండల ంలోని అ ప్రభు వరగౌడ్ ఆయిల్‌పామ్ తోటల్లో పరాగ సంపర్కం కోసం ఉద్యాన శాఖ అధికారులచే ఎలిడో బియస్ కెమెరో నికస్ వీవిల్ ను విడుదల చేశారు. దీని వలన ఫలదీకరణ జరిగి గెలల ఏర్పాటు మెరుగుపడి దిగుబడి పెరుగుతు ందని ఉద్యానవనాధికారి ప్రతాప్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి



శ్రీ జె. ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్ రైతులు ప్రభుత్వ మార్గదర్శకాలు పాటించి వీవిల్ వదలడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు ఎప్పటికప్పుడు ఉద్యాన అధికారులను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి జె. ప్రతాప్ సింగ్, హవేలీ ఘనపూర్ వ్యవసాయ అధికారి బాల్ రెడ్డి, ఉద్యాన అధికారి రచన, లీవ్ పామ్ కంపెనీ మేనేజర్ కృష్ణ, కంపెనీ ప్రతినిధులు, వ్యవసాయ విస్తరణ అధికారిణి తేజస్విని మరియు రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌పై పోచారం తిరుగుబాటు జెండా!

- “కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ అభివృద్ధి”.. “కొంతమంది దుర్మార్గుల వల్లే పార్టీ మారాల్సి వచ్చింది”
- కాంగ్రెస్ ప్రభుత్వంపై పోచారం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

కామారెడ్డి బ్యూరో/ఆగస్టు 11/జన సంఘర్షణ)

బాన్సువాడ: అధికార కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌లో చేరడానికి కారణాలు, ప్రస్తుత ప్రభుత్వ పనితీరుపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రకంపనలు రేపుతున్నాయి. మంగళవారం బీర్కూర్ మండలంలోని మంజీరా నది వద్ద అన్నదాతలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం, వనభోజనాల కార్యక్రమంలో పాల్గొన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. “నియోజకవర్గంలో ఉన్న సమస్యలన్నింటినీ ఆరు నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి జరుగుతుందనే నమ్మకంతోనే కాంగ్రెస్ కండువా కప్పుకున్నాను” అని పోచారం వెల్లడించారు.

**“కొంతమంది దుర్మార్గుల వల్లే పార్టీ మారాల్సి వచ్చింది”**

తాను వ్యక్తిగత స్వార్థంతో పార్టీ మారలేదని పోచారం స్పష్టం చేశారు. కొంతమంది దుర్మార్గుల కారణంగా తాను పార్టీ మారాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెబుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు. “నా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందంటే కేసీఆర్‌ను వదిలి కాంగ్రెస్‌లోకి వచ్చాను. కానీ కాంగ్రెస్ పార్టీలో నాలాంటి వారు మెలగడం సాధ్యం కాదు” అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి.

**కేసీఆర్ పాలనపై ప్రశంసల వర్షం....**

ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను పోచారం శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. కేసీఆర్ హయాంలోనే బాన్సువాడ నియోజకవర్గం గణనీయంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అవసరమని కోరిన వెంటనే కేసీఆర్ స్పందించి నిధులు మంజూరు చేసేవారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**“పదవులు నాకు కొత్త కాదు.. ప్రజల పక్షమే నా బాట”**

తనకు పదవులపై ఎలాంటి ఆశ లేదని పోచారం స్పష్టం చేశారు. ఎమ్మెల్యేగా, శాసనసభ స్పీకర్‌గా సహా అనేక



కీలక పదవులు చేపట్టానని, అధికారం కోసం తాను రాజకీయాలు చేయడం లేదని అన్నారు. “పదవులు నాకు కొత్త కాదు..... ఏది ఉన్నా ప్రజల పక్షాన ఉంటాను. నా స్వార్థం కోసం పార్టీ మారలేదు. నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందనే ఉద్దేశంతోనే నిర్ణయం తీసుకున్నాను” అని పోచారం పేర్కొన్నారు. అయితే అధికార కాంగ్రెస్‌లో ఉంటూనే ఆ పార్టీ ప్రభుత్వంపై పోచారం చేసిన ఈ వ్యాఖ్యలు బాన్సువాడతో పాటు కామారెడ్డి జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఇప్పటికే రాజకీయంగా ప్రాధాన్యత ఉన్న పోచారం వ్యాఖ్యలు రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

# డ్రగ్స్‌కు దూరంగా.. భవిష్యత్తుకు బాటగా

- యువతకు ఎస్పీ పిలుపు.
- ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన మెదక్ ప్రెస్‌క్లబ్.
- సైబర్ మోసాలపై అవగాహనే ఆయుధం.
- ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే నేరాలకు అడ్డుకట్ట.
- మహిళలు, బాలికల రక్షణకు ప్రత్యేక చర్యలు.
- మెదక్ జిల్లా ఎస్పీడి.వి. శ్రీనివాస రావు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జన సంఘర్షణ)

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణతో పాటు మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

నూతనంగా ఎన్నికైన మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌తో పాటు మెదక్ పట్టణానికి చెందిన మీడియా ప్రతినిధులు మంగళవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎస్పీ అభినందించారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారని,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకుల విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఓటీపీ,పిన్, సీవీవీ,బ్యాంకు ఖాతా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఎస్పీ పేర్కొన్నారు. డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు.మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఎస్పీ తెలిపారు. వివిధ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళలు, విద్యార్థినుల్లో చైతన్యం కల్పిస్తున్నామని చెప్పారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని సూచించారు.ప్రజలకు మరింత చేరువగా పోలీసింగ్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎస్పీ తెలిపారు.శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణలో ప్రజలతో పాటు మీడియా సహకారం కీలకమన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ.. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. మహిళలు, బాలికల భద్రత కోసం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, సైబర్ నేరాల నియంత్రణ, డ్రగ్స్ నిర్మూలనకు చేపడుతున్న చర్యలు అభినందనీయమన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించడంలో మీడియా తరఫున పోలీసు శాఖకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నర్సింహాచారి,ప్రధాన






కార్యదర్శి సంగమేశ్వర్,కోశాధికారి చెవిటి అశోక్, గౌరవ కార్యవర్గ సభ్యులు కామాటి కృష్ణ, నీలం, శ్రీధర్, సందీప్, రమేష్, సిద్ధు, రాజాగౌడ్, రహమత్, ఫణిరాజ్, శ్రీహరిగౌడ్, కార్తీక్, సుబ్బు, మల్లేశం, ఫని, మల్లికార్జున్, లక్ష్మణ్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## వై జంక్షన్ దగ్గర బిజెపితో పోలీసుల ఘర్షణ

- బిజెపి నాయకులు, రామాయంపేట పోలీసులు వై జంక్షన్ రోడ్డు వద్ద ఇరువురి మధ్య ఘర్షణ.
- వై జంక్షన్ తీసివేసి ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలని బిజెపి నాయకులు ఎ డిమాండ్. విధులు మంజూరైన ఎందుకు కాంట్రాక్టర్ పట్టించుకోవడంలేదని బిజెపి నాయకులు
- ఆద్య హోటల్ వద్ద భారీ గేట్లు పెట్టడంతో, పోలీసులు, బిజెపి నాయకుల మధ్య ఘర్షణ.
- బిజెపి రాష్ట్ర కమిటీ సభ్యుడు రాగి రాములు ఆధ్వర్యంలో జరిగింది.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జన సంఘర్షణ)




మెదక్ జిల్లా రామాయంపేటలో గల నేషనల్ హైవే 44 వై జంక్షన్ దగ్గర అనేక ప్రమాదాలు అవుతూ పలు మరణాలకు దారితీసాయి. కావున బిజెపి ఆధ్వర్యంలో వై జంక్షన్ ను మూసేస్తామని వారు పిలుపునిచ్చారు.ఈ మేరకు అధికారులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా జాతీయ రహదారిని మూసివేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయడాన్ని అధికారులు తీవ్ర స్థాయిలో అడ్డుకున్నారు దీనితో బిజెపి, పోలీసుల మధ్య వాగ్వాదం తీవ్ర ఘర్షణగా ఏర్పడ్డాది. జిల్లా ప్రధాన కార్యదర్శి చిమ్నా మైన శ్రీనివాస్,బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, దంతేపల్లిసర్పంచ్ బాలరాజ్, మాజీ ఎంపీటీసీ సిద్ధ రాములు రామాయంపేట మున్సిపల్ బిజెపి కౌన్సిలర్ శంకర్ గౌడ్, కాంటెస్ట్ ఎమ్మెల్యే పంజా విజయ్ కుమార్,అధ్యక్షుడు భాను,నవాత్ రాజేంద్రప్రసాద్, బీజేవైఎం అధ్యక్షుడు కన్నయ్య విజయం,ప్రధాన కార్యదర్శి నాగరాజ్, సంతోష్, బానప్ప గారి ఏసు రెడ్డి, రామాయంపేట మండల ప్రధాన కార్యదర్శి దిలీప్, నాగరాజు కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు సంగయ్య, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రంగయ్య, కిసాన్ మోర్చా అధికార ప్రతినిధి దేవేందర్, రాంపూర్ సర్పంచ్, నిజాంపేట సర్పంచ్ అక్కన్నపేట రైల్వే స్టేషన్ వార్డ్ సభ్యురాలు నాగరాణి, నందిగామ సర్పంచ్ ఆకుల రమేష్,లక్ష్మాపూర్ నవీన్ గౌడ్ తదితరులు పట్టణ ప్రధాన కార్యదర్శి నవీన్ అక్కల అనిల్ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

## వై జంక్షన్ 44 జాతీయ రహదారి పైన రాత్రి స్కూటర్ పై నుండి కిందపడి తీవ్ర గాయాలై మృతి

- ఈ మేరకు రామాయంపేట పోలీస్ స్టేషన్లో పోలీస్ లను సమాచారం అడిగి తెలుసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 11 (జన సంఘర్షణ)





జూపల్లి వెంకట్రావు తండ్రి మాధవరావు వయసు 49 సంవత్సరాలు వృత్తి ప్రైవేట్ ఉద్యోగం తేది 11.08.2026 నాడు తన స్కూటీ నెంబర్ TS 08 GR 3647 గలదానిపై బాచుపల్లి హైదరాబాద్ నుండి తన స్వగ్రామమైన మల్కాపూర్ గ్రామం బీబీపేట మండలం కామారెడ్డి జిల్లాకు బయలుదేరి వస్తుండగా అర్ధరాత్రి 02:30 గంటలకు రామాయంపేట శివారులో గల ఆధ్యా హోటల్ ఎన్-44 రోడ్డు వద్ద ఏదో గుర్తు తెలియని వాహనం డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ టక్కరించి పారిపోవడం జరిగింది. వెంకట్రావు అనే వ్యక్తి స్కూటీ పై నుండి కింద పడిపోయి కాళ్లకు చేతులకు తలకు బలమైన గాయాలు అయి కింద పడిపోగ అక్కడ రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్లే వ్యక్తి చూసి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని అంబులెన్స్ ద్వారా రామయంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగ చికిత్స పొందుతూ గాయపడిన వ్యక్తి మరణించినాడు ఈ విషయాన్ని మృతుడి కుమారుడు జూపల్లి రిషివేదుకు సమాచారం ఇవ్వగా రామాయంపేట ఆసుపత్రికి మృతుడు కుటుంబ సభ్యులు చేరుకున్నారు.

## హాస్టల్లో విషాదం.. పాము కాటుతో ముగ్గురు బాలికలు మృతి

- నిద్రిస్తున్న సమయంలో ఆరుగురికి పాము కాటు..
- ఆసుపత్రికి తరలింపు। మరో ముగ్గురికి చికిత్స

మహారాష్ట్ర, /ఆగస్టు 11:/జన సంఘర్షణ)



మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. జప్తలై గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్లో నిద్రిస్తున్న బాలికలను పాము కాటు వేయడంతో ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. ఈ ఘటనతో విద్యార్థినులు, తల్లిదండ్రులు, హాస్టల్ సిబ్బందిలో తీవ్ర ఆందోళన నెలకొంది. సోమవారం రాత్రి హాస్టల్లో నిద్రిస్తున్న సమయంలో ఆరుగురు బాలికలను పాము కాటేసినట్లు అధికారులు తెలిపారు. పాము కాటుతో తీవ్ర అస్వస్థతకు గురైన బాలికలను హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే చికిత్స పొందుతూ 8, 12, 14 ఏళ్ల వయసున్న ముగ్గురు బాలికలు మృతి చెందారు. మరో ముగ్గురు బాలికలకు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోంది. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు తీవ్రంగా స్పందించి విచారణకు ఆదేశించారు. హాస్టల్‌లో భద్రతా చర్యలు, పాము కాటుకు దారితీసిన పరిస్థితులపై అధికారులు ఆరా తీస్తున్నారు. చిన్నారుల మృతితో జప్తలై గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. హాస్టల్‌లో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## వర్ని-పోతంగల్ బ్రిడ్జిపై భారీగా గంజాయి పట్టివేత!

- ఇద్దరి అదుపులో.. 9. కిలోల. 700 గ్రాములు. పైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం। పోలీసుల విచారణ

వర్ని/పోతంగల్,/ఆగస్టు 11/జన సంఘర్షణ)



మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి తెలంగాణలోకి గంజాయి అక్రమ రవాణా కొనసాగుతున్న నేపథ్యంలో వర్నిపోతంగల్ బ్రిడ్జి వద్ద భారీగా గంజాయి పట్టుబడినట్లు సమాచారం. పక్కా సమాచారం మేరకు.....: మంగళవారం వర్ని పోలీసులు సబ్‌స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించినట్లు తెలుస్తోంది. వారి వద్ద గంజాయి లభించినట్లు సమాచారం. అనంతరం విచారణలో భాగంగా పోతంగల్ బ్రిడ్జి వద్ద ఇద్దరి నుంచి సుమారు 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న అనుమానంతో ఇద్దరినీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. గంజాయి ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎక్కడికి తరలిస్తున్నారు? ఈ అక్రమ రవాణా వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**అధికారుల హెచ్చరిక...**

గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాకు సహకరించే వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నట్లు సమాచారం. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అనుమానాస్పదంగా గంజాయి రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఈ గంజాయి పట్టివేతకు సంబంధించి పోలీసుల అధికారిక ధృవీకరణ ఇంకా వెలువడాల్సి ఉంది. పట్టుబడిన గంజాయి పరిమాణం, నిందితుల పూర్తి వివరాలు, కేసు నమోదు తదితర అంశాలపై జిల్లా పోలీస్ అధికారులు అధికారికంగా వెల్లడించే అవకాశం ఉంది. పోలీసుల అధికారిక ప్రకటన వెలువడిన అనంతరం ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

## వీధి దీపాల నిర్వహణలో కొటగిరి గ్రామపంచాయతీ ఆదర్శం

- ఫోటో సెన్సార్, ప్యానల్ బాక్స్ ఏర్పాటు.. కోటగిరి సర్పంచ్ బర్ల మధుకర్ కు గ్రామస్థుల అభినందనలు

కొటగిరి, /ఆగస్టు 11: /జన సంఘర్షణ)





నిజామాబాద్ జిల్లా కొటగిరి గ్రామంలో వీధి దీపాల నిర్వహణకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వినూత్న చర్యలు చేపట్టారు. వీధి దీపాలు ప్రతిరోజూ సాయంత్రం సమయానికి ఆటోమేటిక్‌గా వెలిగేలా, ఉదయం వేళ ఆటోమేటిక్‌గా ఆఫ్ అయ్యేలా ఫోటో... సెన్సార్, ప్యానల్ బాక్స్ ఏర్పాటు చేశారు. ఈ సాంకేతిక విధానం ద్వారా వీధి... దీపాలను మాన్యువల్‌గా ఆన్, ఆఫ్ చేయాల్సిన అవసరం లేకుండా పోవడంతోపాటు విద్యుత్ వినియోగాన్ని కూడా నియంత్రించే అవకాశం ఏర్పడింది. రాత్రివేళ గ్రామంలోని వీధుల్లో మెరుగైన వెలుతురు అందుబాటులో ఉండేలా ఈ చర్య ఉపయోగపడుతుందని గ్రామస్థులు తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని.. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్న కొటగిరి గ్రామ సర్పంచ్,బర్ల మధుకర్ ను గ్రామస్థులు అభినందించారు. ఈ విధానం ఇతర గ్రామపంచాయతీలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా సాంకేతికతను వినియోగించడం ద్వారా గ్రామాభివృద్ధిలో కొటగిరి గ్రామపంచాయతీ మరో ముందడుగు వేసిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉచిత పథకాలపై హైకోర్టు వ్యాఖ్యలు..

- వైరల్ అవుతున్న వీడియో!
- "కూర్చుంటే డబ్బులు.. నిలబడితే డబ్బులు.. మరి పని చేయాల్సిన అవసరం ఏంటి?"
- రేషన్ కార్డులు, ఉచిత పథకాలపై తీవ్ర చర్చ.. రాష్ట్ర భవిష్యత్తుపై ప్రశ్నలు
- జన సంఘర్షణ న్యూస్- ప్రత్యేక కథనం...

హైదరాబాద్/ఆగస్టు 11/జన సంఘర్షణ)




హైదరాబాద్: ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఉచిత పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై న్యాయస్థానంలో వ్యక్తమైనట్లు చెబుతున్న కొన్ని వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఉచిత పథకాలతో ప్రజల్లో పని చేసే ఉత్సాహం తగ్గిపోతుందా? రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై వాటి ప్రభావం ఎంత? అనే అంశాలపై చర్చకు దారితీస్తున్నాయి. వైరల్ అవుతున్న వీడియోలో న్యాయమూర్తి ఉచిత పథకాల అమలుపై ఆందోళన వ్యక్తం చేసినట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా చేతిలో ఖరీదైన మొబైల్ ఫోన్, బైక్ వంటి వస్తువులు ఉన్నప్పటికీ ప్రభుత్వ రేషన్, ఇతర ఉచిత ప్రయోజనాలు పొందుతున్న వారి పరిస్థితిపై ప్రశ్నలు లేవనెత్తినట్లు ప్రచారం జరుగుతోంది.

**"కూర్చుంటే డబ్బులు.. నిలబడితే డబ్బులు.."**

ప్రభుత్వాలు ప్రజలకు సంక్షేమం అందించడం అవసరమే అయినప్పటికీ, అర్హత ఉన్నవారికే ప్రయోజనాలు అందుతున్నాయా? లేక అవసరం లేని వారికి కూడా పథకాల ప్రయోజనాలు చేరుతున్నాయా? అనే అంశాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందనే చర్చ మొదలైంది. "కూర్చుంటే డబ్బులు.. నిలబడితే డబ్బులు.. ఇలా ప్రతి దానికి ప్రభుత్వం డబ్బులు ఇస్తే ప్రజలు ఎందుకు పనిచేయాలి?" అనే భావనతో సాగిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారితీశాయి.

**రైతులకు కూలీలు దొరకని పరిస్థితి ఎందుకు?..**

ఉచిత పథకాల ప్రభావంపై మరో కోణం కూడా చర్చకు వస్తోంది. వ్యవసాయ పనులకు స్థానికంగా కూలీలు అందుబాటులో లేకపోవడంతో బీహార్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వలస కూలీలను తీసుకువచ్చి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## కల్లు ప్యాకెట్లలో నట్టలు, జేన్యాలు?

- పోతంగల్‌లో కల్లు నాణ్యతపై కలకలం..
- ఎక్సైజ్ శాఖ తనిఖీలు ఎప్పుడు?
- నిబంధనలు అతిక్రమిస్తే డిపో యజమానులపై కఠిన చర్యలు తప్పవంటున్న ప్రజలు

పోతంగల్,/ ఆగస్టు 11:/(జన సంఘర్షణ)





పోతంగల్ మండల కేంద్రంలోని కొన్ని కల్లు డిపోలలో విక్రయిస్తున్న కల్లు ప్యాకెట్లలో నట్టలు, జేన్యాలు కనిపిస్తున్నాయంటూ స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కల్లు తయారీ, నిల్వ, ప్యాకింగ్, విక్రయ ప్రక్రియలో పరిశుభ్రత ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వినియోగదారులకు అందించే కల్లులో పురుగులు కనిపిస్తున్నాయన్న ఆరోపణలు నిజమైతే, ఈ వ్యవహారం తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని వారు హెచ్చరిస్తున్నారు.

**ఎక్సైజ్ అధికారుల తనిఖీలు తప్పనిసరి**

ఈ నేపథ్యంలో సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి పోతంగల్ మండలంలోని కల్లు డిపోలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కల్లు నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించడంతో పాటు, పరిశుభ్రత ప్రమాణాలపై కూడా అధికారులు పరిశీలన చేయాలని కోరుతున్నారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు**

కల్లు డిపో యజమానులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, నాణ్యత లోపాలు లేదా అపరిశుభ్ర పరిస్థితులు అధికారుల తనిఖీల్లో బయటపడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అధికారులు కేవలం తనిఖీలతో సరిపెట్టకుండా, తప్పులు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి పోతంగల్‌లోని కల్లు డిపోలపై ప్రత్యేక దృష్టి సారించాలి.. ప్రజలకు నాణ్యమైన, పరిశుభ్రమైన కల్లు అందేలా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో సంబంధిత శాఖ అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు ప్రశ్నించాల్సి వస్తుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# హాస్టల్లో విద్యార్థులపై వార్డెన్ దాడి?

- కర్రతో కొట్టినట్లు సుమారు పది మంది విద్యార్థుల ఆరోపణలు..
- శరీరాలపై దెబ్బల గుర్తులు ఉన్నట్లు సమాచారం
- ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలి..
- విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రుల ఆందోళన

చందూర్, /ఆగస్టు 11:/జన సంఘర్షణ (

నిజామాబాద్ జిల్లా చందూర్ మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులపై వార్డెన్ దాడి చేశారన్న ఆరోపణలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. హాస్టల్ వార్డెన్ కల్పలత తమపై కర్రతో దాడి చేసినట్లు సుమారు పది మంది విద్యార్థులు ఆరోపించినట్లు సమాచారం. విద్యార్థులు తెలిపిన వివరాల.... ప్రకారం.. తాము ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినప్పటికీ వార్డెన్ తమ మాట వినకుండా కర్రతో కొట్టినట్లు ఆరోపించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థుల శరీరాలపై దెబ్బల గుర్తులు కనిపించినట్లు సమాచారం.

**తల్లిదండ్రుల్లో ఆందోళన**

విద్యార్థులపై క్రమశిక్షణ పేరుతో దాడి చేశారన్న ఆరోపణలతో తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టే పేరుతో కొట్టడం ఎంతవరకు సమంజసమని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. హాస్టల్‌లో విద్యార్థుల భద్రతకు అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఘటనపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి హాస్టల్‌ను పరిశీలించాలని కోరుతున్నారు.

**సమగ్ర విచారణకు డిమాండ్**

విద్యార్థులపై దాడి జరిగిందన్న ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆరోపణలు విచారణలో నిజమని తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విద్యార్థుల భద్రత విషయంలో... ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించరాదని,



భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా హాస్టల్‌లో పర్యవేక్షణను పెంచాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గమనిక: ..ఈ ఘటనకు సంబంధించిన ఆరోపణలపై అధికారిక విచారణ పూర్తయ్యే వరకు సంబంధిత వ్యక్తులపై ఆరోపణలను నిర్ధారిత వాస్తవాలుగా పరిగణించరాదు.


## ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవతో రేపల్లెవాడలో బీటీ రోడ్డు పనులు ముమ్మరం

- వేగంగా కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులు..
- గ్రామస్తుల హర్షం

ఎల్లారెడ్డి,/ ఆగస్టు 11:/జన సంఘర్షణ)

ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవతో రేపల్లెవాడ గ్రామంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామ ప్రజలు చాలాకాలంగా ఎదుర్కొంటున్న రహదారి సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం రహదారి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డు నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారుల కారణంగా ఎదురయ్యే ఇబ్బందులు తగ్గడంతో పాటు, రేపల్లెవాడ నుంచి సమీప గ్రామాలు, ప్రధాన రహదారులకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడనుంది. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్న ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు రేపల్లెవాడ గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో అభివృద్ధి పనులు ముందుకు సాగుతున్నాయని స్థానిక నాయకులు పేర్కొన్నారు.




## ఖండ్‌గాం ప్రభుత్వ పాఠశాలలో కోతుల బెడద

- భయాందోళనలో విద్యార్థులు..
- తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలి: తెలంగాణ విద్యార్థి పరిషత్

బోధన్, /ఆగస్టు 11: /జనసంఘర్షణ)



బోధన్ మండలం ఖండ్‌గాం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కోతుల బెడదతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని తెలంగాణ విద్యార్థి పరిషత్ (ం+వూ) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నాయకులు ఖండ్‌గాం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయడంతో పాటు పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పాఠశాల పరిసరాల్లో కోతుల సంచారం రోజురోజుకూ పెరుగుతుండటంతో విద్యార్థులు భయపడుతున్నారని టీజీవీపీ బోధన్ డివిజన్ అధ్యక్షుడు మీసాలే నాగేష్ తెలిపారు. కోతులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశిస్తుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళన విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొందన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని నాగేష్ కోరారు. కోతులు పాఠశాల ఆవరణలోకి ప్రవేశించకుండా అవసరమైన రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు సంబంధిత శాఖల సమన్వయంతో కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందస్తుగానే అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. సమస్యను నిర్లక్ష్యం చేసి విద్యార్థులకు ఏదైనా ప్రమాదం జరిగితే అందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఖండ్‌గాం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ కోతుల బెడదను వెంటనే నివారించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీవీపీ పట్టణ కార్యదర్శి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో విషాదం.. భార్యాభర్తల ఆత్మహత్య

- ఉరివేసుకుని భర్త.. నిద్రమాత్రలు మింగిన భార్య
- కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణమా?

నిజామాబాద్, /ఆగస్టు 11:/జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ వ్యక్తి తన భార్యతో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఏర్గట్ల మండల కేంద్రానికి చెందిన... శేషాల నరేష్ (40) విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ, నిజామాబాద్‌లోని ఈఆర్డీఓ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన భార్య లిమేఘన (32)లితో కలిసి నగరంలోని బైపాస్ రోడ్డులో అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం ప్రకారం మంగళవారం ఉదయం దంపతుల మధ్య గొడవ





జరిగినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆవేశానికి లోనైన నరేష్ ఉరివేసుకోగా, మేఘన నిద్రమాత్రలు సేవించినట్లు సమాచారం. ఇద్దరూ అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. మృతదంపతులకు 6, 8 సంవత్సరాల.. వయస్సు గల ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిసింది. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే ఈ విషాదానికి కారణమై ఉండొచ్చని స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే అసలు కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు,.. బంధువులు విషాదంలో మునిగిపోయారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఒంటరి మహిళ పథకం, విద్యార్థుల స్కాలర్షిప్ = గ్యాస్ పథకం....?

- ఒంటరి మహిళకు జడ్జిమెంట్ కాపీ....?
- విద్యార్థులకు అడుగడుగునా బ్లాక్ లిస్ట్ హెచ్చరికలు....?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, చర్ల మండలం, ఆగష్టు 11(జనసంఘర్షణ):




చర్ల మండలంలో ఒంటరి మహిళకు, దరకాస్తూ చేసుకునే మహిళకు, జడ్జి మెంట్ కాఫీ కావాలి అంటున్న రెవెన్యూ అధికారులు, తమకు విన్నవించిన షరతులు, సూచనలు ఆలా ఉన్నని అంటున్న రెవెన్యూ సిబ్బంది. ఆలా ఐతే భర్త ఆదరణకు నోచుకోని, కూలి నాలి చేసుకుంటూ పడరాని పాట్లు పడుతున్న ఒంటరి మహిళకు పదకానికీ తిలోదకాలు అడ్డంకులుగా ఏర్పాడ్డాయి. ఇక విద్యార్థుల స్కాలర్షిప్‌కు అడుగడుగునా బ్లాక్ లిస్ట్ హెచ్చరికలు, స్కాలర్షిప్ బాధ్యతలు స్కూల్స్, కాలేజీ యాజమాన్యంకు బాధ్యతలు అప్పగించాలి, లేనియడల విద్యార్థులకు చూసించిన ఆంక్షలు బ్లాక్ లిస్ట్ హెచ్చరికలతో తీవ్రంగా నష్ట పోతారు. విద్యార్థులు, ఈ విశయం పైన విద్యాశాఖ బాధ్యతలు చూస్తున్న ముఖ్యమంత్రి తగు వెసులుబాటు కల్పించాలి. స్కాలర్షిప్ ఆన్లైన్ ప్రక్రియ మొత్తం కాలేజ్ యాజమాన్యానికి అప్పగించాలి, అడ్మిషన్స్‌తో కాలేజ్ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల అందరికి షరతులు లేని స్కాలర్షిప్ మంజూరు చేయాలని విద్యార్థిని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం | తెలుగు దినపత్రిక
బుధవారం
12 ఆగస్టు 2026

# కాన్పూర్-లక్నో ఎక్స్ ప్రెస్ వే పై టోల్ రద్దు...

- **రూ.4,200 కోట్లతో నిర్మించిన కాన్పూర్-లక్నో ఎక్స్‌ప్రెస్‌వే ప్రారంభమైన నెలలోపే గుంతలు, కుంగిపోవడంతో ఎన్‌హెచ్‌ఏఐ టోల్ వసూళ్లు తాత్కాలికంగా నిలిపివేసింది.**
- **నిర్మాణ సంస్థపై మూడేళ్ల నిషేధం విధించి అధికారులపై చర్యలు తీసుకుంది.**
- **1 టోల్ రద్దుతో రెట్టింపు అయిన వాహనాల రాకపోకలు"**
- **2 ప్రారంభించిన నెల లోపే గుంతలు, కోతలు**
- **3 రూ.4,200 కోట్లతో ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం**
- **4 మూడేళ్ల పాటు కాంట్రాక్ట్ ఏజెన్సీ పై నిషేధం**
- **5సెక్యూరిటీ డిపాజిట్ నుంచి రెండు శాతం సొమ్ములు జప్తు**

ఉత్తరప్రదేశ్/ఆగస్టు 11/ (జన సంఘర్షణ)
ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో రూ. 4,200 కోట్ల వ్యయంతో నిర్మించిన ఎక్స్ ప్రెస్ వేను ప్రారంభించిన మూడు వారాలకే మట్టి కుప్పల దిబ్బగా మారింది. గోతులు ఏర్పడ్డం, నెర్రెలు బారడం, కుంగిపోవడంతో పలు వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. వాహనదారుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు రావడంతో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ఏఐ) రంగంలోకి దిగింది. ఈ ప్రాజెక్టులో లోపాలకు బాధ్యులైన ముగ్గురు ఇంజినీరింగ్ అధికారులను బాధ్యతల నుంచి తొలగించింది. ఈ ఎక్స్ ప్రెస్ వే పై టోల్ వసూలు ను తాత్కాలికంగా రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. విచిత్రమేంటే టోల్ రద్దు చేసిన తరువాత వాహనాల రద్దీ పెరగడం విశేషం. కాన్పూర్-లక్నో ఎక్స్ ప్రెస్ వే ను జూలై 13వ తేదీన కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ లు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తో కలిసి ప్రారంభించారు. 63 కిలోమీటర్ల ఎక్స్ ప్రెస్ వే కు రూ. 4,200 కోట్లు ఖర్చు చేశారు. ఎక్స్ ప్రెస్ వే కు పీఎన్సీ ఇన్ ఫ్రా టెక్ లిమిటెడ్ కాంట్రాక్టు ఏజెన్సీ గా వ్యవహరించింది. వాహనాల రాకపోకలను అనుమతించిన తరువాత జూలై 26వ తేదీ నుంచి సమస్యలు మొదలయ్యాయి. ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడ్డం, కుంగిపోవడం, అక్కడక్కడ వాహనాలు అకస్మాత్తుగా జారడం జరిగింది. దీంతో పలువురు వాహనదారులు భయాందోళనకు గురై రోడ్డు ఎక్కాలంటేనే వణికిపోయారు. ఈ సమస్యను పలువురు వాహనదారులు ఎదుర్కోవడంతో ఎన్ హెచ్ఏఐ రంగంలోకి దిగింది. ఐఐటీ ఖరగ్ పూర్ నిపుణులతో సాంకేతిక పరీక్షలు నిర్వహించింది. నిపుణులు ఇచ్చిన నివేదిక ప్రకారం రూ. 3 కోట్ల వ్యయంతో గుంతలు పూడ్చడం, కోతకు గురైన రోడ్డును పునర్ నిర్మాణం చేయాలని సదరు నిర్మాణ సంస్థ ను ఆదేశించింది. మరమత్తు పనులు పూర్తయ్యే వరకు టోల్ ఛార్జీలు కూడా చెల్లించేది లేదని, అప్పటి వరకు నష్టం భరించాల్సిందేనని స్పష్టం చేసింది. ఉన్నావ్ లోని కొర్రాయి ప్రాంతంలో మూడు వందల మీటర్ల పొడవునా వాహనాలు నడపలేకపోతున్నామని, జారుతున్నాయంటూ పలువురు సోషల్ మీడియాలో జూలై 26వ తేదీన



వీడియోలు షేర్ చేశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ నాసిరకం పనులు చేయడం మూలంగానే ఈ దుస్థితి దాపురించిందంటూ ఆక్రోశం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో మాత్రమే ప్రస్తుతం ట్రాఫిక్ ను మళ్లించారు. ఫిర్యాదులు రావడంతో ఎన్ హెచ్ఏఐ అధికారులు కాంట్రాక్ట్ ఏజెన్సీ ప్రాజెక్టు మేనేజర్ తో పాటు ఇండిపెండెంట్ ఇంజినీర్, రెసిడెంట్ ఇంజినీర్ ను విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలను తక్షణమే అమలు చేయాలని ఏజెన్సీకి స్పష్టం చేసింది. ఇదే కాకుండా వచ్చే మూడేళ్ళ పాటు ఎన్ హెచ్ఏఐ పనుల్లో పాల్గొనకుండా, టెండర్ వేయకుండా సదరు నిర్మాణ సంస్థ పీఎన్సీ ఇన్ ఫ్రా టెక్ ప్రైవేటు లిమిటెడ్ పై నిషేధం విధించింది. దీంతో పాటు పనితీరులో విఫలం అయినందుకు సెక్యూరిటీ డిపాజిట్ నుంచి రెండు శాతం సొమ్ములు జప్తు చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. ఇండిపెండెంట్ ఇంజినీర్ గా వ్యవహరిస్తున్న థీమ్ ఇంజినీరింగ్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ గుర్తింపు ఎందుకు రద్దు చేయకూడదో తెలియచేయాలంటూ నోటీసులు జారీ చేసింది. నాసిరకం నిర్మాణ పనులు చేపట్టినా నిర్లక్ష్యం వహించినందుకు గతంలో పనిచేసిన ప్రాజెక్టు డైరెక్టర్ సౌరభ్ చౌరసాయా పై ఛార్జిషీట్ కూడా దాఖలు చేసింది. ప్రస్తుత ప్రాజెక్టు డైరెక్టర్ గా వ్యవహరిస్తున్న ప్రకాశ్ వర్మ విధుల్లో నిర్లక్ష్యం వహించనట్లు తేలడంతో ఆయనను మాతృ సంస్థకు సరెండర్ చేస్తూ ఎన్ హెచ్ఏఐ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. నాసిరకం పనులుపై ఎన్ హెచ్ఏఐ రీజినల్ ఆఫీసర్ గౌతమ్ విశాల్ చరణ్ పహారీ మాట్లాడుతూ.. ఫిర్యాదులు అందిన వెంటనే చర్యలు చేపట్టామని, నాణ్యతా లోపాలు ఉన్న ప్రాంతంలో మరమత్తులు పూర్తి చేశామన్నారు. సాంకేతిక కమిటీని కూడా రంగంలోకి దింపి, ప్రాథమిక నివేదిక కూడా తెప్పించామన్నారు. వాహనదారుల రక్షణ కోసం ట్రాఫిక్ ను మళ్లించామన్నారు. ఐఐటీ సాంకేతిక నిపుణుల కమిటీకి ప్రొఫెసర్ కేఎస్ రెడ్డి నేతృత్వం వహించారని, పూర్తి నివేదిక త్వరలో సమర్పిస్తారన్నారు. ఎక్కడ లోపాలు ఉన్నాయనేది లోతుగా అధ్యయనం చేసే పనిలో కమిటీ ఉందన్నారు. దీంతో పాటు ఎన్ హెచ్ఏఐ కూడా లేజర్ ప్రొఫిలో మీటర్ తో పరీక్షలు చేస్తున్నదన్నారు. ఉత్తర ప్రదేశ్ రాజధాని లక్నో నుంచి కాన్పూర్ పారిశ్రామిక ప్రాంతానికి సరకు రవాణాను వేగిరం చేసేందుకు ఆరు లేన్ల ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం చేపట్టారు. దీంతో ప్రయాణ సమయం 90 నిమిషాల నుంచి 60 నిమిషాలకు తగ్గించి, ట్రాఫిక్ రద్దీని క్రమబద్ధీకరించారు. ఎక్స్ ప్రెస్ వే పనుల్లో నాణ్యత లోపించిందని, రోజుల వ్యవధిలో కుంగిపోతున్నదంటూ సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ ఎక్స్ వేదికగా బీజేపీ ప్రభుత్వాన్ని విమర్శించారు. 17 రోజుల వ్యవధిలో రెండు సార్లు మరమత్తులు చేపట్టి వాహనదారులను ఇబ్బందులకు గురి చేయడం సిగ్గుచేటన్నారు. బీజేపీ అవినీతి కి ఎక్స్ ప్రెస్ వే నిర్మాణం నిదర్శనమని ఉత్తరప్రదేశ్ పీసీసీ విమర్శలు గుప్పించింది.

# ఎత్తొండ క్యాంప్‌లో ఉచిత వైద్య శిబిరం

- **గ్రామస్తులకు వైద్య పరీక్షలు..**
- **ఉచితంగా మందుల పంపిణీ**

కోటగిరి, /ఆగస్టు 11:/ (జన సంఘర్షణ)
నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం ఎత్తొండ క్యాంప్ గ్రామంలో మంగళవారం ఉచిత జనరల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కోటగిరి సౌజన్యంతో గ్రామ సర్పంచ్ గైని వీరమణి అర్జున్ అధ్యక్షతన ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో స్టార్ హాస్పిటల్ వైద్యులు... డాక్టర్ గణేష్, డాక్టర్ మాధురి గ్రామస్తులకు క్షుణ్ణంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ ఆరోగ్య సమస్యలపై వైద్య సలహాలు అందించడంతో పాటు చిన్నపాటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు.

**షుగర్, బీపీ పరీక్షలు..**

వైద్య శిబిరంలో భాగంగా గ్రామస్తులకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల ఫలితాల ఆధారంగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు, జీవనశైలిలో పాటించాల్సిన మార్పులపై వైద్యులు అవగాహన కల్పించారు.

**స్టార్ హాస్పిటల్ సిబ్బందికి సన్మానం...**

ఈ సందర్భంగా సర్పంచ్ గైని వీరమణి అర్జున్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించిన స్టార్ హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులకు, సిబ్బందికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి వైద్య శిబిరాలు మరిన్ని నిర్వహించడం ఎంతో అవసరమని అన్నారు. అనంతరం స్టార్ హాస్పిటల్... యాజమాన్యం, వైద్యులు, సిబ్బందిని సర్పంచ్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోనేరు




తరుణ్ సాయి తేజ, వార్డు సభ్యులు ఇక్బాల్, రాములు, జమీర్, సునీత, రాజేశ్వరి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, స్టార్ హాస్పిటల్ కోటగిరి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆదివాసీ పౌష్టికాహారం, రక్షిత మంచినీరు అందించాలి

- **అడ ప్రాజెక్ట్, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీళ్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలి**
- **కొమరం భీమ్ వర్ధంతి నాటికి కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు డబుల్ రోడ్డు వేయాలి**
- **తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత**
- **టీఆర్ఎస్ లో పలువురు ఆదివాసీ నాయకుల చేరిక**

హైదరాబాద్ :/ఆగస్టు 11/జన సంఘర్షణ)
రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీలకు పౌష్టికాహారం, రక్షిత తాగునీటిని అందించాలని, ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఆదివాసీ నాయకులు, తెలంగాణ ఆదివాసీ టైగర్ సేన నాయకులు మంగళవారం బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ రక్షణ సేనలో చేరారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. ఆదివాసీల ఆరాధ్య దైవం కొమరం భీమ్ వర్ధంతి నాటికి కెరమెరి నుంచి జోడేఘాట్ వరకు డబుల్ రోడ్డు నిర్మించాలన్నారు. అడ ప్రాజెక్టు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుల కాల్వలు ఆధునీకరించి మొత్తం 60 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వాలని డిమాండ్ చేశారు. పోడు సమస్య పరిష్కరించాలని.. గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన హక్కుల పత్రాలకు సంబంధించిన భూములు వెంటనే ఆదివాసీలకు అప్పగించాలని కోరారు. ఇందుకోసం ఫారెస్ట్, రెవెన్యూ అధికారులతో జాయింట్ సర్వే నిర్వహించాలన్నారు. ఆదివాసీలకు అండగా ఉండటం కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలు నామ్ కే వాస్తేగా మారిపోవడం దురదృష్టకరమన్నారు. ఆదివాసీ నాయకుడు సోయం బోజారావు గుట్టబండపై మట్టి పోసి పంటలు సాగు చేయడం ఆదివాసీల దుర్భర స్థితిగతులను తెలియజేస్తుందన్నారు. త్వరలోనే ఆదివాసీ ప్రాంతాలను సందర్శిస్తామని, ఆదివాసీలకు ఎల్లవేళలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కోట్నక కిషన్ రావ్, పెందోర్ ధర్ము, పెందోర్ దౌలత్ రావ్ తదితరులు టీఆర్ఎస్ లో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి





బోడ జనార్దన్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్ చార్జీ కావేటి సబిత తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సంత్ నాందేవ్ మహారాజ్ పుణ్యతిథి

- **దోమలేడ్గి విఠలేశ్వర మందిరంలో ఘనంగా 676వ పుణ్యతిథి వేడుకలు**

పోతంగల్, /ఆగస్టు 11: /జన సంఘర్షణ)



మేరు కులస్తుల ఆరాధ్య దైవం, పాండురంగ విఠలుని పరమ భక్తుడు సంత్ నాందేవ్ మహారాజ్ 676వ పుణ్యతిథి వేడుకలు పోతంగల్ మండలం దోమలేడ్గి గ్రామంలోని విఠలేశ్వర మందిరంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

**భజనలు, కీర్తనలు.. ఆధ్యాత్మిక ప్రవచనాలతో సందడి**

పుణ్యతిథి వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం ఉదయం కామప్ప మహారాజ్ ఆధ్వర్యంలో కీర్తనలు, భజనలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం భక్తి భావంతో మార్మోగింది. అనంతరం సంత్ నాందేవ్ మహారాజ్ జీవిత చరిత్ర, ఆయన బోధనలు, భక్తి మార్గం గురించి ఆధ్యాత్మిక ప్రవచనాలు నిర్వహించారు.తదుపరి గులాల్ కార్యక్రమంతో పాటు పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంత్ నాందేవ్ మహారాజ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**భక్తి మార్గాన్ని చాటిన మహనీయుడు**

ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు గట్ల రవీందర్ మాట్లాడుతూ.. సంత్ నాందేవ్ మహారాజ్ పాండురంగ విఠలుని పరమ భక్తుడని, కులమతాలకు అతీతంగా భక్తి మార్గాన్ని ప్రజలకు చాటి చెప్పిన మహనీయుడని కొనియాడారు. ప్రతి ఒక్కరూ భగవంతుని నామస్మరణ చేస్తూ సన్మార్గంలో పయనించాలని సూచించారు.

**భక్తులకు అన్నప్రసాద వితరణ**

కార్యక్రమం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ వేడుకల్లో జెల్ల గంగాధర్, శ్రీధర్, మగ్దేవార్ రాములుతో పాటు గ్రామస్తులు, మేరు కులస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# హనుమాన్ మందిర్ అభివృద్ధికి రూ.20 లక్షలు..

- **పోచారం శ్రీనివాస్ రెడ్డి హామీ**
- **గ్రామ కమిటీ వినతికి సానుకూల స్పందన..**
- **అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామని హామీ**

బాన్సువాడ/ఆగస్టు 11/జన సంఘర్షణ)



గ్రామంలోని హనుమాన్ మందిర్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని గ్రామ కమిటీ సభ్యులు సోమవారం గౌరవనీయులు పోచారం శ్రీనివాస్ రెడ్డిను కలిసి వినతి చేశారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ మందిర్‌లో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 20 లక్షల నిధులు కేటాయించాలని కోరారు. గ్రామ కమిటీ ప్రతిపాదనపై పోచారం శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించి, రూ. 20 లక్షలతో అభివృద్ధి పనులకు సహకరిస్తామని హామీ ఇచ్చారు. మందిర్ అభివృద్ధికి సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డికి గ్రామ ప్రజలు, గ్రామ కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మందిర్ అభివృద్ధితో పాటు గ్రామ ఆధ్యాత్మిక వాతావరణానికి మరింత ఊతం లభిస్తుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే కుమార్తె వివాహ వేడుకకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలి

- **నూతన వధూవరులను.... ఆశీర్వదించండి..**
- **వివాహ విందును స్వీకరించండి: మద్నూర్ సర్పంచ్ ఉషా సంతోష్ మేస్త్రీ**

మద్నూర్, ఆగస్టు 11 (జన సంఘర్షణ):



జుక్కల్ నియోజకవర్గ ప్రజలంతా ఒక్కటై ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కుమార్తె జోనిట వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని మద్నూర్ సర్పంచ్ ఉషా సంతోష్ మేస్త్రీ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 16న కందరుపల్లి సమీపంలోని డీబీఎల్ స్థలంలో ఎమ్మెల్యే కుమార్తె జోనిట వివాహ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించాలని కోరారు.వివాహ వేడుకకు వచ్చే ప్రతి ఒక్కరికీ ఆత్మీయ స్వాగతం పలుకుతూ ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కుటుంబంతో తమ అనుబంధాన్ని చాటుకునేలా ప్రతి ఒక్కరూ ఈ వేడుకలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ ఉషా సంతోష్ మేస్త్రీ కోరారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం · తెలుగు దినపత్రిక
బుధవారం
12 ఆగస్టు 2026

# రాజాపురం అంగన్వాడీ కేంద్రంలో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీ

- **పౌష్టికాహారం, పరిశుభ్రత, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి**

పాల్వంచ, /ఆగస్టు 11: /జన సంఘర్షణ)
చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య పరిరక్షణ చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ ఐఏఎస్ రాజాపురం అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాల్వంచ మండలం కిన్నెరసాని గ్రామపంచాయతీ పరిధిలోని రాజాపురం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ కేంద్రంలో అందుతున్న సేవలను సమగ్రంగా పరిశీలించారు.

**చిన్నారుల హాజరు, విద్యా కార్యక్రమాలపై ఆరా**

అంగన్వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, వారికి అందుతున్న సేవలు, రోజువారీ విద్యా కార్యకలాపాలపై అంగన్వాడీ టీచర్‌ను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం చిన్నారులకు ప్రతిరోజూ పౌష్టికాహారం అందుతున్నదీ, లేదా అన్నదీ పరిశీలించారు. చిన్నారుల హాజరు క్రమం తప్పకుండా ఉండేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యతపై పరిశీలన**

చిన్నారులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. భోజనం నాణ్యత, ఆహార పదార్థాల తయారీ విధానం, వంట ప్రాంతంలోని పరిశుభ్రతపై ఆరా తీశారు. చిన్నారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని సిబ్బందికి స్పష్టం చేశారు. అదేవిధంగా చిన్నారులకు అందిస్తున్న గుడ్లు, ఇతర పౌష్టికాహార పదార్థాల నిల్వలను పరిశీలించి వాటి నిల్వ, వినియోగం, పంపిణీ వివరాలను తెలుసుకున్నారు.

**పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి**

అంగన్వాడీ కేంద్రంలోని తరగతి గది, వంటగది, తాగునీటి సదుపాయం, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. చిన్నారులు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంలో ఉండేలా కేంద్రాన్ని నిత్యం శుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీటి సదుపాయం సక్రమంగా ఉండేలా చూడడంతో పాటు వంట ప్రాంతంలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.

**చిన్నారుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ**

చిన్నారుల ఎదుగుదల, ఆరోగ్య పరిస్థితి, పోషక స్థితిని నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ అంకిత్ అధికారులకు, అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. అర్హులైన ప్రతి చిన్నారికి ప్రభుత్వం అందిస్తున్న



పౌష్టికాహారం, ఇతర సంక్షేమ సేవలు పూర్తిస్థాయిలో అందేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వారి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. అంగన్వాడీ కేంద్రాల పనితీరును క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో అంగన్వాడీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పౌష్టికాహార కార్యక్రమాలు అర్హులైన చిన్నారులకు పూర్తిస్థాయిలో చేరేలా పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

# రైల్వే మంత్రితో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ భేటీ

- **హైదరాబాద్-ముంబై బుల్లెట్ ట్రైన్ రూట్‌లో జహీరాబాద్‌ను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్**

న్యూఢిల్లీ, /ఆగస్టు 11:/జన సంఘర్షణ)
హైదరాబాద్--ముంబై హైస్పీడ్ రైల్ (బుల్లెట్ ట్రైన్) కారిడార్‌ను తొలుత ప్రతిపాదించిన విధంగానే సంగారెడ్డి-జహీరాబాద్-షోలాపూర్ మీదుగా కొనసాగించాలని కోరుతూ జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి అధికారిక వినతిపత్రం సమర్పించారు. ఇటీవల బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని తాండూర్--వికారాబాద్ మీదుగా మళ్లించేలా ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు తెరపైకి వస్తుండటంతో జహీరాబాద్ ప్రాంత ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందని ఎంపీ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఎన్‌హెచ్‌ఎస్‌ఆర్‌సీఎల్ (నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్) రూపొందించిన ప్రాథమిక డీపీఆర్ (వివరమైన ప్రాజెక్టు నివేదిక) ప్రకారం అసలు మార్గాన్నే కొనసాగించాలని ఆయన గట్టిగా కోరారు.

**జహీరాబాద్ రూట్‌కే మూడు కీలక కారణాలు**

**పారిశ్రామిక అభివృద్ధి:**

ఎన్ఐసీడీఐటీ (నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్) పరిధిలో



జహీరాబాద్‌లో అభివృద్ధి చేస్తున్న జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ దేశంలోనే కీలక పారిశ్రామిక కేంద్రంగా ఎదుగుతోందని ఎంపీ పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ కల్పిస్తే పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని వివరించారు.

**తక్కువ నిర్మాణ వ్యయం:**

తొలి డీపీఆర్‌లో పేర్కొన్న ఇంజినీరింగ్ ప్రమాణాల ప్రకారం జహీరాబాద్ మీదుగా వెళ్లే అసలు మార్గం ద్వారా బుల్లెట్ ట్రైన్ కారిడార్ నిర్మాణానికి తక్కువ వ్యయం అయ్యే అవకాశం ఉందని ఎంపీ తెలిపారు. ప్రజాధనం ఆదా చేయడంతో పాటు ప్రాజెక్టు అమలులోనూ ఇది ప్రయోజనకరంగా ఉంటుందని వివరించారు.

**అనుకూలమైన భౌగోళిక పరిస్థితులు:**

జహీరాబాద్ మార్గం భౌగోళికంగా అనుకూలంగా ఉండటంతో నిర్మాణ పరంగా ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ మార్గాలతో పోలిస్తే స్థానిక సమస్యలు, భూసేకరణకు సంబంధించిన ఇబ్బందులను కూడా నివారించే అవకాశం ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

**జహీరాబాద్‌కు అన్యాయం జరగకూడదు**

ప్రాంతాల సమగ్ర, సమాన ఆర్థికాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని జహీరాబాద్ మీదుగా ప్రతిపాదించిన బుల్లెట్ ట్రైన్ రూట్‌ను యథాతథంగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ సురేష్ షెట్కార్ రైల్వే మంత్రిని కోరారు. జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ లభిస్తే పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని ఆయన వివరించారు. ఈ అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించి జహీరాబాద్ రూట్‌ను కొనసాగించేలా వ్యక్తిగత హామీ ఇవ్వాలని ఎంపీ కోరారు.

# ఆటో కార్మికుల గర్జన.. రేపు ఇందిరాపార్క్‌లో ధర్నా!

- **సమస్యల పరిష్కారం కోసం కదం తొక్కనున్న ఆటో కార్మికులు..**
- **పాల్గొననున్న కల్వకుంట్ల కవిత**

హైదరాబాద్, /ఆగస్టు 11:/జన సంఘర్షణ)
ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ (టీ ఆర్ టీ య యూ) అనుబంధ ఆటో కార్మిక సంఘం పోరుబాట పట్టింది. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు బుధవారం హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ ధర్నాచౌక్ వేదికగా భారీ ధర్నాకు సిద్ధమైంది. ఆగస్టు 12న ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న ఈ ధర్నాలో




ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లను బలంగా వినిపించనున్నారు. ఆటో కార్మికుల జీవనోపాధి, హక్కులు, సంక్షేమం, ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీయనున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.

**కార్మికుల పోరాటానికి కవిత మద్దతు**

ఈ ధర్నా కార్యక్రమానికి టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత హాజరై ఆటో కార్మికులకు మద్దతు ప్రకటించనున్నారు. దీంతో ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద ధర్నా కార్యక్రమం రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంది.

**డిమాండ్ల సాధనకు ఐక్య పోరు**

ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, వారి జీవన భద్రతకు అవసరమైన చర్యలు చేపట్టాలని టీఆర్‌టీయూ అనుబంధ ఆటో కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఐక్యంగా పోరాడుతామని స్పష్టం చేశారు. ఆటో కార్మికులందరూ భారీ సంఖ్యలో తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు.

# ఖాజాపూర్ అంగన్వాడీ కేంద్రంలో పరిశుభ్రత.. పోషకాహారంపై అవగాహన

- **బి.ఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం**

సాలూరు/ఆగస్టు 11/జన సంఘర్షణ)




ఖాజాపూర్: సాలూరు మండలం ఖాజాపూర్ అంగన్వాడీ కేంద్రంలో బి.ఎస్సీ అగ్రికల్చర్ జగిత్యాల విద్యార్థుల ఆధ్వర్యంలో పరిశుభ్రత, పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. చిన్నారులకు భోజనం చేసే ముందు సబ్బుతో చేతులు శుభ్రంగా కడుక్కోవడం, గోళ్లను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవడం, ప్రతిరోజూ స్నానం చేయడం, జుట్టును శుభ్రంగా ఉంచుకోవడం వంటి వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్ల ప్రాధాన్యతను విద్యార్థులు వివరించారు.

**పోషకాహారంతోనే ఆరోగ్యకర ఎదుగుదల**

చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని అవగాహన కల్పించారు. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పులు, పాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. వివిధ ఆహార పదార్థాల ప్రాధాన్యతను ప్రదర్శన ద్వారా చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారు. పరిశుభ్రత పాటించడం, పోషకాహారం తీసుకోవడం ద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఎదగవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి.ఎస్సీ అగ్రికల్చర్ జగిత్యాల విద్యార్థులు, అంగన్వాడీ టీచర్, తల్లిదండ్రులు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. చిన్నారుల ఆరోగ్యంపై అవగాహన కల్పించిన విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

# హైదరాబాద్ లో మహిళ అనుమానాస్పద మృతి..

చిలకలూరిపేట:/ఆగస్టు 11/జనసంఘర్షణ)




వివాహేతర సంబంధం నేపథ్యంలో మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన నూర్ బాష ఆశా (33) కొంతకాలంగా తన 12 ఏళ్ల కుమారుడితో కలసి తాగునీటి చెరువుకు వెళ్లే టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటుంది. సుమారు ఐదేళ్ల కిందట కుటుంబ కలహాల నేపథ్యంలో భర్తతో విడిపోయింది. కొంతకాలంగా తన మాజీ భర్త ఊరికి చెందిన పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన, సుల్తాన్ తో వివాహేతర సంబంధం ఏర్పడింది. సుల్తాన్ కూడా భార్యతో విడిపోయి వేరుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఐదు రోజుల కిందట కుమారుడిని తెలిసిన వాళ్ల ఇంటిలో వదిలివేసి ప్రియుడు సుల్తాన్తో కలసి హైదరాబాద్ వెళ్లింది. అక్కడ మెకానిక్గా పనికి కుదిరిన సుల్తాన్ గురువారం ఉదయం పనుల నిమిత్తం షెడ్డుకు వెళ్లాడు. అతను పనిలో ఉండగా ఇంటి చుట్టుపక్కల వారు ఫోన్ చేసి ఆశా ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉన్నట్లు, తాము కిటికీలో నుంచి చూశామని సమాచారం అందించారు. దీంతో ఇంటికి చేరుకున్న సుల్తాన్ మృతదేహాన్ని తీసుకొని అంబులెన్స్లో ఎక్కించుకొని చిలకలూరిపేటలోని వైఎస్సార్ కాలనీ వద్దకు చేరుకున్నాడు. అంబులెన్స్ కు బాడుగ డబ్బులు తీసుకువస్తానని వెళ్లి ఎంతకు రాకపోవడంతో అనుమానం వచ్చిన అంబులెన్స్ డ్రైవర్ డయల్ 100కు, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో చిలకలూరిపేట పట్టణ పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సుల్తాను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మందకృష్ణ మాదిగకు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కుమార్తె వివాహ ఆహ్వానం

- **హైదరాబాద్‌లో మర్యాదపూర్వక భేటీ.. వివాహ ఆహ్వాన పత్రిక అందజేత**



మద్నూర్, /ఆగస్టు 11/జన సంఘర్షణ):
జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్‌తో కలిసి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగను మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు తన కుమార్తె వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ మందకృష్ణ మాదిగకు వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఎమ్మెల్యే అందించిన ఆహ్వానాన్ని మందకృష్ణ మాదిగ సాదరంగా స్వీకరించారు. వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి దాంపత్య జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలతో నిండాలని ఆకాంక్షించారు. ఈ మర్యాదపూర్వక భేటీలో పలువురు నాయకులు, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఎక్సైజ్ అధికారుల మెరుపు దాడులు..

- **15.7 కిలోల గంజాయి పట్టివేత!**
- **రూ.8 లక్షల విలువైన గంజాయి స్వాధీనం.. స్మగ్లర్ల కోసం గాలింపు**
- **అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారుల హెచ్చరిక**

ఖమ్మం బ్యూరో/, ఆగస్టు 11/జన సంఘర్షణ:
ఖమ్మం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో ఎక్సైజ్ ఎస్టీఎఫ్, సీ అండ్ డీ బృందాలు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. అక్రమంగా గంజాయి రవాణా జరుగుతోందన్న




విశ్వసనీయ సమాచారంతో మోతీనగర్ పరిసరాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించిన సంచులను అధికారులు పరిశీలించగా 15.7 కిలోల గంజాయి లభించింది. దీని విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే ఎక్సైజ్ బృందాలను గమనించిన గంజాయి తరలింపుదారులు అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. దీంతో గంజాయిని అన్‌క్లెయిమ్డ్‌గా స్వాధీనం చేసుకున్న అధికారులు, తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఖమ్మం-2 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పరారీలో ఉన్న గంజాయి స్మగ్లర్లను పట్టుకునేందుకు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎక్సైజ్ ఎస్టీఎఫ్ సీఐలు వెంకటేశ్వర్లు, నాగరాజు తెలిపారు.

**అధికారుల హెచ్చరిక**

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, నిల్వలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు నిఘాను మరింత ముమ్మరం చేస్తామని స్పష్టం చేశారు. గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై సమాచారం తెలిసిన వారు వెంటనే ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
బుధవారం
12 ఆగస్టు 2026

# ఎల్లారెడ్డి నియోజకవర్గానికి అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరిన ఎమ్మెల్యే మదన్ మోహన్

ఎల్లారెడ్డి/ఆగస్ట్ 11/జన సంఘర్షణ)



ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అర్హత కలిగిన అనేక మంది పేద, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో, అదనంగా 2,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ గారు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖల గౌరవ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి కోరారు. నియోజకవర్గంలో ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన అనేక కుటుంబాలు సొంత ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, మొదటి విడతలో ఇళ్ల మంజూరులో అవకాశం దక్కని అర్హులైన, నిజమైన లబ్ధిదారులందరికీ అవకాశం కల్పించేలా అదనపు ఇళ్లను మంజూరు చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ మంత్రిని కోరారు. అలాగే ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు పొందిన లబ్ధిదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బిల్లులు, నిర్మాణ దశలకు అనుసంధానమైన విడతల చెల్లింపులను త్వరితగతిన విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. నిధులు సకాలంలో అందితే లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాన్ని ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

# బోధన్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ

- పేద విద్యార్థులకు అండగా వైద్యులు శైలేందర్..
- సానా పటేల్ చేతుల మీదుగా 400 నోట్‌బుక్స్ అందజేత

బోధన్/ఆగస్ట్ 11/జన సంఘర్షణ



బోధన్: పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో సామాజిక కార్యకర్త, ప్రముఖ వైద్యులు డాక్టర్ శైలేందర్ తన వంతు సహాయాన్ని అందించారు. బోధన్ పట్టణంలోని తట్టికోట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సుమారు 400 నోట్‌బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. డాక్టర్ శైలేందర్ ఆర్థిక సహకారంతో సమకూర్చిన నోట్‌బుక్స్‌ను సానా పటేల్ చేతుల మీదుగా పేద విద్యార్థులకు అందజేశారు. నోట్‌బుక్స్ అందుకోవడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

**పేద విద్యార్థులకు అండగా నిలవడమే లక్ష్యం**

ఈ సందర్భంగా డాక్టర్ శైలేందర్ మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో తన వంతుగా సహాయం చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన సహకారం అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెంచేలా ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. పేద విద్యార్థుల చదువుకు చేయూతనందించిన డాక్టర్ శైలేందర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

## టీడీపీ కార్యకర్త భౌతికకాయానికి నివాళులర్పించిన నెల్లూరు మోహన్‌రెడ్డి

కోట ఆగస్ట్11 జన సంఘర్షణ).



పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా కోట మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దుంపల ఏడుకొండలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన భౌతికకాయానికి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నెల్లూరు మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి ఏడుకొండలను అంబులెన్స్ ఏర్పాటు చేసి హుటాహుటిన ఆసుపత్రికి తరలించే ప్రయత్నం నుండి ఆయన కుటుంబానికి అండగా నిలిచారు మోహన్‌రెడ్డి, మార్గ మధ్యలో ఏడుకొండలు ప్రాణాలు విడవడం ఆయన్ను తీవ్రంగా కలిచివేసింది. ఆసుపత్రిలో పోస్ట్ మార్టం లాంఛనాలతో సహా భౌతికకాయాన్ని ఏడుకొండలు స్వగృహానికి తరలించడం మొదలుకొని అంతిమయాత్ర వరకు అన్ని ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు.

# ఆగస్టు 15న దరఖాస్తు చేసిన వికలాంగులందరికీ పింఛన్లు మంజూరు చేయాలి

- వికలాంగుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయి
- సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు బోధన్‌లో వికలాంగుల చట్టాలపై రాష్ట్ర సదస్సు
- 33 జిల్లాల నుంచి 500 మంది ప్రతినిధులు హాజరు

బోధన్, /ఆగస్టు 11/జన సంఘర్షణ)





ఆగస్టు 15న తెలంగాణ ప్రభుత్వం కొత్తగా మంజూరు చేయనున్న చేయూత పింఛన్లలో వైకల్య ధ్రువీకరణ పత్రాలు పొందిన వికలాంగులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య, నిజామాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. రమేష్ బాబు డిమాండ్ చేశారు. అర్హులైన వికలాంగులకు పింఛన్లు మంజూరు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేటలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నిజామాబాద్ జిల్లా విస్తృత సమావేశం జిల్లా అధ్యక్షులు గైని రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలోని వికలాంగుల సమస్యలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో వికలాంగుల హక్కుల పరిరక్షణకు రూపొందించిన 2016 వికలాంగుల హక్కుల చట్టం, 2017 మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం, జాతీయ విధానం, జాతీయ ట్రస్ట్ వంటి నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడం లేదన్నారు. 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం ప్రధాన కమిషనర్ పోస్టును ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. వికలాంగుల పింఛన్లలో కేంద్ర ప్రభుత్వం వాటాను రూ.300 నుంచి రూ.5 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. వీబీజీ రామ్‌జీ 2025 అమలు చేయడం వల్ల వికలాంగుల జీవనోపాధికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే దరఖాస్తు చేసిన వారిని పరిగణనలోకి తీసుకోవాలి. ఆగస్టు 15న కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని నాయకులు తెలిపారు. అయితే 2023 డిసెంబర్‌లో కొత్త చేయూత పింఛన్ల కోసం దరఖాస్తులు స్వీకరించినప్పుడు 24.85 లక్షల మంది, 2026 మేలో దరఖాస్తులు స్వీకరించినప్పుడు 10.22 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించినప్పటికీ మళ్లీ కొత్తగా దరఖాస్తులు స్వీకరించడం వల్ల లబ్ధిదారులకు ప్రయోజనం ఉండదని, కేవలం సేవా కేంద్రాలకు మాత్రమే ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అర్హులైన వారందరినీ పరిగణనలోకి తీసుకుని పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 32 నెలల కాలంలో వికలాంగుల్లోని 21 రకాల వైకల్యాలకు సంబంధించి వేలాది మందికి కొత్తగా వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని తెలిపారు. అయితే వారందరికీ పింఛన్లు ఇవ్వకుండా కేవలం తలసేమియా, సికిల్‌సెల్, హీమోఫీలియా బాధితులకు మాత్రమే కొత్తగా పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించడం మిగతా వికలాంగులకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు మరోసారి నిరాశ మిగలకుండా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పింఛన్ల కోసం జూన్ 10న సెర్ప్ కార్యాలయం ఎదుట ధర్నా, జూలై 20న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. చేయూత పింఛన్లకు దరఖాస్తు చేసుకునే లబ్ధిదారులకు ఆదాయ పరిమితి విధించడం సరికాదన్నారు. ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన వికలాంగులందరికీ చేయూత పింఛన్లు మంజూరు చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**బోధన్‌లో సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్ర సదస్సు**

వికలాంగుల చట్టాలు, సంక్షేమ పథకాలపై సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు బోధన్ పట్టణంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 500 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని పేర్కొన్నారు. సదస్సును విజయవంతం చేసేందుకు వికలాంగులు, ప్రజాసంఘాలు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. ఈ సమావేశంలో జిల్లా వర్కింగ్ అధ్యక్షురాలు పి. కవిత, జిల్లా కార్యదర్శి యేశాల గంగాధర్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ నజీర్, లక్ష్మి, సహాయ కార్యదర్శులు భాను, సాయిలు, సాయమ్మతో పాటు జిల్లా నాయకులు బీరుగొండ, దేవదాసు, శంకర్ గౌడ్, చిన్న సాయిలు, గంగారాం, పావని, సావిత్రి, పీరబాయి, గంగామణి, గంగవ్వ, విజయ, లలిత, మహేష్, ఇక్బాల్, రజిత తదితరులు, వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ట్రాఫిక్ డీసీపీ కుమార్తె మృతి

గుంటూరు/ఆగస్టు 11/జన సంఘర్షణ)



గుంటూరు రూరల్: సెలవు కావడంతో సరదాగా గడుపుదామని ఆదివారం తన స్నేహితులతో కలిసి బీచ్కు బయలుదేరిన విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షిరీన్బేగం కుమార్తె షేక్ ఆసిఫా(24) రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం.. ఈ ప్రమాదం గుంటూరు నగర శివారులోని ఏటుకూరు సమీపంలో జరిగింది. కారులో ఉన్న ఆసిఫా ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. తాడేపల్లికి చెందిన ఉండి రుత్విక్ (జిమ్ నిర్వాహకుడు), అవినాష్, సుధీర్, షేక్ ఆసిఫా, వంశీ స్నేహితులు. వీరంతా ఆదివారం ఉదయం చీరాల వెళ్లేందుకు కారులో బయలుదేరారు. ఏటుకూరు సమీపంలోకి వచ్చిన సమయంలో జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో లారీ ఆగింది. కారు నడుపుతున్న అవినాష్ వాహనాన్ని నియంత్రించలేకపోవడంతో లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టి రోడ్డు పక్కనున్న డివైడర్ను తాకి ఆగిపోయింది. కారు ముందుభాగంలో ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నాయి. వెనుక సీటులో కూర్చున్న ఆసిఫా తలకు తీవ్రగాయాలయ్యాయి. హైవే పెట్రోలింగ్ సిబ్బంది అక్కడికి వచ్చి క్షతగాత్రులను సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి ఆసిఫా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నల్లపాడు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్కు తరలించారు. రుత్విక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై సుభాని తెలిపారు.

# లాయర్ అయితే నాకేంటి.. చంపకుండా ఇక్కడి నుంచి వెళ్లను!


- సొంత పార్టీ లీగల్ సెల్ సభ్యుడి ఇంటిపై వైసీపీ ఎంపీపీ..
- దాడి టెంటు, కుర్చీలు తెప్పించుకొని మరీ వీరంగం

తెనాలి/ఆగస్టు 11/ జన సంఘర్షణ)

తెనాలి టౌన్ : 'నువ్వు లాయర్వి అయితే నాకేంటి.. నిన్ను చంపకుండా ఇక్కడి నుంచి కదిలేది లేదు. నీకు దిక్కున్న చోట చెప్పుకో' అంటూ వైకాపా ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు హల్చల్ సృష్టించారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం కరెవరం గ్రామానికి చెందిన న్యాయవాది షేక్ ఖాదర్ హుస్సేన్ గ్రామీణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ఆదివారం మధ్యాహ్నం ఖాదర్ హుస్సేన్ ఇంటి నుంచి పట్టణంలోని కార్యాలయానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన సమయంలో తెనాలి మండల వైకాపా ఎంపీపీ చెన్నకేశవులు, మరో వ్యక్తితో కలిసి బైక్ పై ఎదురుగా వస్తున్నప్పుడు వీరి వాహనాలు ఢీకొన్నాయి. ఖాదర్పై చెన్నకేశవులు దుర్భాషలాడగా వాగ్వాదం జరిగింది. పరస్పరం చేయి చేసుకున్నారు. ఆగ్రహించిన చెన్నకేశవులు తన అనుచరులు సుమారు 40మందిని ఘటనాస్థలికి పిలిపించారు. వారంతా న్యాయవాది ఇల్లు, కుటుంబసభ్యులపై దాడి చేశారు. కిటికీలు, తలుపులు పగలగొట్టారు. భయభ్రాంతులకు గురైన కుటుంబసభ్యులు ఖాదర్ హుస్సేన్ ను ఇంట్లోకి తీసుకువెళ్లి తలుపులు వేసుకున్నారు. శాంతించని చెన్నకేశవులు 'నిన్ను చంపే వరకూ ఇక్కడే ఉంటా'నంటూ టెంటు, కుర్చీలు తెప్పించుకున్నారు. పెట్రోల్ తీసుకురండి తగలబెట్టేద్దామంటూ కేకలు వేస్తూ వీరంగం వేశారు. పోలీసులు వచ్చి చెన్నకేశవులును అక్కడి నుంచి పంపించేందుకు యత్నించినా విన్లేదు. క్షమాపణ చెబితేనే వెళ్తానంటూ కేకలేశారు. గ్రామస్థులు, న్యాయవాదులు పెద్దసంఖ్యలో రావడంతో.. 'తర్వాతైనా నీ అంతు చూస్తా'నంటూ







అక్కడి నుంచి వెళ్లిపోయారు. తనకు, తన కుటుంబ సభ్యులకు చెన్నకేశవులు వల్ల ప్రాణహాని ఉందని ఖాదర్ హుస్సేన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చెన్నకేశవులు, అతని సోదరుడుశ్రీనివాస్, అనుచరుడు లక్ష్మయ్య పేర్లను అందులో ప్రస్తావించారు. బాధితుడు ఖాదర్హుస్సేన్ వైసీపీ తెనాలి మండల లీగల్ విభాగంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఈఘటనపై బార్ అసోసియేషన్ సభ్యులు సోమవార నిరసనలకు పిలుపునిచ్చారు.

Printed, published and owned by **Rachamallu Madhavi** Printed at **Kranthi Printing Press**, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : **Rachamallu Madhavi**. **RNI Reg No :tel/2024/89323,** Cell 6305026524, Email:janasangarshana@gmail.co